

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : **బి.వి.ఎల్.ఎన్.రాజు**



సంపుటి : 12 | సంచిక : 8 | ఏప్రిల్ 2007

**రమణ భాస్కర**

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 32

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

**చందా**

సంవత్సర చందా:రూ॥150/-

విడి ప్రతి : రూ॥ 10/-

చిరునామా

**రమణ భాస్కర**

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు - 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు - 534 265

☎ 08814 - 224747

9247104551


**ఈ సంచికలో....**


జిన్నూరు............ 09-03-07

చించినాడ......... 11-03-07

పాలమూరు....... 05-02-07

చించినాడ......... 16-02-07



ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747


## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 09-03-2007, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

యోగా అంటే కొన్ని ఎక్సర్‌సైజులు చెపుతారు, మీరు రోజూ ఉదయం నడుస్తూ ఉంటారు. ఇవి అన్నీ శరీరానికి మంచిదే, మనస్సును నిగ్రహించుకోవటానికి ప్రాణాయామం కొంతవరకు సహకరిస్తుంది. ప్రాణాయామం చేస్తూ ఉంటే మనస్సు మనలను బాధపెట్టకుండా పది నిమిషాలు ఆగుతుంది. ఇవి అన్నీ యోగా క్లాసులలో నేర్పుతున్నారు. కాని భగవంతుడు చెప్పిన యోగం అంటే భగవంతుడిలో ఐక్యం అవ్వటానికి మనస్సును సమాయత్తం చేయటం. మనస్సును భగవంతుడిలో ఐక్యం చేయటానికి మీరు చేసే ప్రతీ పని కూడా యోగమే. పరీక్షలు వచ్చినప్పుడు చదువుకొనే పిల్లలు పరీక్షలకు ఎలా ప్రిపేర్ అవుతారో అలాగ భగవంతుడిలో ఐక్యం అవ్వటానికి మన మనస్సును మనం ప్రిపేర్ చేయాలి. మన మనస్సును మనం సంస్కరించుకోవటమే యోగం, మనస్సును నియమించుకోవటమే యోగం. ఎంతవరకు మనస్సును నియమించుకోవాలి అంటే నది వెళ్ళి సముద్రంలో ఎలా కలుస్తుందో అలాగ ఈ మనస్సు వెళ్ళి భగవంతుడిలో ఐక్యం అవ్వాలి. మీలో ఇద్దరి మనస్సులు ఒకేలాగ ఉన్నాయి అనుకోండి, స్నేహంగా ఉంటారు. మనస్సులు ఒకలాగ ఉండకపోతే వారు ఎడమొఖం, పెడమొఖం కింద ఉంటారు. భగవంతుడి యొక్క మనస్సు ఎంత పవిత్రంగా ఉంటుందో, ఎంత విశాలంగా ఉంటుందో అలాగ ఆ స్థాయిని మన మనస్సు చేరితే అప్పుడు అది భగవంతుడిలో ఐక్యమవుతుంది, అది కడసారి జన్మ. బహుజన్మల కృషి వలన కాని మీరు భగవంతుడిలో ఐక్యం కాలేరు అని పరమాత్మ

చెప్పాడు. అసలు మనం సాధన ఏమీ చేయటం లేదు. అది కావాలి, ఇది కావాలి అని కోరికలతోనే సరిపోతోంది. ప్రాపంచిక మనుషుల గొడవ వదిలి వేయండి, అసలు భక్తులు చెయ్యవలసిన మొదటి పని, రెండవ పని, చివరి పని కూడా మనస్సును బాగుచేసుకోవటమే, అదే ముఖ్యమైన పని అని భక్తులకు అర్థమవ్వటం లేదు. ఆహారం పట్ల నియమం ఉండాలి. ఆహారం తినేటప్పుడు ఇది సరిపోతుంది అని శరీరం చెపుతుంది, అప్పుడు మనం మానెయ్యాలి. అన్నం తినేటప్పుడు ప్రక్కవారితో మాట్లాడకుండా మౌనంగా తినాలి. భగవంతుడిని స్మరించు కొంటూ తింటే అది ప్రసాదమవుతుంది. మనం తినే ఆహారవే మనస్స కింద తయారవుతుంది, అందుచేత ఆహారం విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. నియమములన్నింటిలో ఆహారనియమం ఉత్తమమైనది అని రమణమహర్షిగారు చెప్పారు. ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉంటే శరీరం, మనస్సు అదుపులోనికి వస్తాయి, సాధన చెయ్యటానికి సహకరిస్తాయి. అనారోగ్యం వచ్చినప్పుడు ఆరోగ్యం చేకూర్చుకోవటానికి అందరూ ప్రయత్నం చేస్తారు. మన శరీరం ఆరోగ్యంగా ఉన్నప్పడే ఆరోగ్యసూత్రాలను పాటిస్తే అనారోగ్యం రాదు, ఆరోగ్యం అలా కంటిన్యూ అవుతుంది. మనకు భగవదనుభవం కలగటానికి వారు అడ్డు, వీరు అడ్డు అనుకొంటాము కాని మన మనస్సే మనకు అడ్డువస్తోందని మనకు తెలియటం లేదు.

మీరు భౌతికంగా, ఆధ్యాత్మికంగా బాగుపడాలంటే ఎవరోవచ్చి ఉద్ధరిస్తారని కనిపెట్టుకొని ఉండకండి. మీ బాగుకోసం మీరు కృషి చేసుకోండి, మీరు కృషిచేస్తూ ఉంటే భగవంతుడి సహాయం వస్తుంది, గురువు సహాయం వస్తుంది. మన మనస్సు మీద ఉన్న నమ్మకం భగవంతుడి మీద లేదు. మనకు పని గురించి అసలు సంకల్పం రాలేదు అనుకోండి, ఆ పని అవ్వదేమో అనుకొంటాము. మన సంకల్పంతో సంబంధం లేకుండా భగవంతుడు సంకల్పిస్తే ఆ పని పూర్తి అయిపోతుంది. భగవంతుడి సంకల్పం లేకుండా మనం కాళ్ళు కదపలేము, చేతులు కదపలేము, అంతా భగవంతుడే. మరణించేటైములో నీవు ఏది స్మరిస్తే అది అవుతావు, నీకు ఏవిధమైన తలంపులు వస్తే దానినిబట్టి పునర్జన్మ వస్తుంది. ఇప్పటినుండి ప్రయత్నం చేస్తేగాని శరీరం మరణించేటప్పుడు మనకు మంచిఆలోచనలు రావు, భగవంతుడిని స్మరించలేము. ఇది బాగా గుర్తు పెట్టుకోండి. ఇప్పటినుండి ప్రిపేర్ అయితే ప్రాణం దేహాన్ని విడిచిపెట్టే టైము వచ్చేటప్పటికి మనకు మంచిఆలోచనలు, మంచితలంపులు వస్తాయి. భగవంతుడు మన మనస్సులో నిలబడి ఉంటాడు. ప్రాణం మన శరీరాన్ని విడిచిపెట్టక ముందే మనం ఆనందస్థితిని, శాంతిస్థితిని పొందగలిగితే ఇంక మనం శవాలను మోయనక్కరలేదు, పునర్జన్మ లేదు. యజ్ఞభావనతో పనిచెయ్యమని భగవంతుడు చెప్పాడు.

మన మనస్సును పవిత్రం చేయటానికే యజ్ఞాలన్నీ పరమాత్మ చెప్పాడు. దేవయజ్ఞం అంటే దేవతలను పూజించటం, వారికి నమస్కరించటం వలన వారి ఋణం తీరిపోతుంది. మనుష్యయజ్ఞం అంటే నువ్వు సుఖంగా ఉండు, ఇతరులు సుఖంగా జీవించటానికి సహాయం అందించండి. అది మనుష్యయజ్ఞం. మీమీద ఆధారపడి జంతువులు ఉంటాయి. మిమ్మల్ని మీరు ఎలా చూసుకొంటున్నారో జంతువులను కూడా అలా ప్రేమగా చూసుకోవాలి, దానిని భూతయజ్ఞం అంటారు. ఋషియజ్ఞం చాలా ముఖ్యం. మీకు ఇంటి దగ్గర పనులు అయిపోయిన తరువాత ఖాళీగా ఉన్నప్పుడు రామకృష్ణ పరమహంస చెప్పిన మాటలుగాని, భగవాన్ చెప్పిన మాటలుగాని, భగవద్గీతగాని, మీకు నచ్చిన శాస్త్రం ఏదో ఒకటి అధ్యయనం చేసుకోవాలి. అది ఋషియజ్ఞం.

ఒకటి మీరు గుర్తు పెట్టుకోండి. వాడు చెడ్డవాడు, వీడు మంచివాడు అంటారు అనుకోండి. చెడ్డవారి మీద ద్వేషం పెరుగుతుంది, మంచి వారి మీద ఇష్టం పెరుగుతుంది, అది పాపానికి దారి తీస్తుంది. చెడ్డ వారిమీద ద్వేషం పెట్టుకోవద్దు, పోనీ వారితో స్నేహం చేయటం మానివేయవచ్చు. వాడు చెడ్డవాడు, వాడు చెడ్డవాడు అని అనుకొంటే వాడికంటే నువ్వు ఎక్కువ చెడ్డవాడవు అయిపోతావు. మీలో చెడ్డ లేదు అనుకోండి వారిలో చెడ్డ కనబడదు, మీలో ఉన్న చెడ్డే, మీలో ఉన్న అశాంతే బయట కనిపిస్తోంది. నీ మనస్సులో ఉన్నదే బయట కనిపిస్తుంది కాని నీ మనస్సులో లేనిది బయట కనబడదు. మంచి, చెడ్డ, సుఖం, దుఃఖం అంతా మనస్సులో ఉంది, మనస్సు అనే గడప దాటితే ఏమీ లేదు, ఉన్నది అంతా మహావెలుగు, మహాశాంతి, మహాఆనందం. సుఖం, శాంతి అనేవి బయట లేవు, నీ హృదయంలో ఉన్నాయి. మన హృదయంలో ఉన్న సుఖం, శాంతి, ఆనందం మనకు దొరికేవరకు జననమరణ ప్రవాహంలో తిరుగుతూ ఉండవలసిందే, చనిపోతూ పుడుతూ ఉండవలసిందే. ఏ మనిషికి దేవుడు అక్కరలేదు, సుఖం కావాలి, శాంతి కావాలి. మీరు నూటికి నూరుపాళ్ళు సుఖంగా ఉన్నారు అనుకోండి, శాంతిగా ఉన్నారు అనుకోండి మీకు దేవుడు తాలుక తలంపు అసలు రాదు. మీకు అశాంతిగా ఉన్నప్పడే దేవుడు జ్ఞాపకం వస్తాడు. మేము చాలా గ్రేట్ అని కొంతమంది అనుకొంటారు. చైతన్యానికి ఎక్కువ, తక్కువ ఏమిటి? దానికి ద్వితీయం లేదు. ఈ గొప్పలు అన్నీ మనస్సుకే, ఇవి అన్నీ మనస్సు కల్పించిన విషయాలు. మనస్సు కల్పించిన విషయాలలో పడిపోయి, ఇలా వేలాది జన్మలు కొట్టుకొని పోతున్నాము. మనం ఏమి చెయ్యాలి అంటే మన మాట, చేత, ఆలోచన ఇవి అన్నీ మన మనస్సును బాగుచేస్తున్నాయా, లేదా అని మనం లోపల చూసుకొంటూ ఉండాలి. జన్మాంతర అనుబంధాన్ని బట్టి ఒకో వాసన ఒకో మనిషిని పీడించేస్తుంది. ఆవాసన యొక్క పీడ ఎలా

వదులుతుంది అంటే దానిని తొలగించుకోవటానికి నీవు ఎంతోకొంత ప్రయత్నం చేస్తూ ఉంటే, గురువును ప్రార్థిస్తూ ఉంటే, ఈశ్వరుడిని ప్రార్థిస్తూ ఉంటే ఆ వాసన నెమ్మదిగా పల్చబడి రాలిపోతుంది. ఏ అలవాటు అయితే మనిషిని పీడించేస్తోందో అదే నిజం అని వాడికి అనిపిస్తుంది, అది ఇంకపోదేమో అని వాడికి అనిపిస్తుంది, కాని ప్రయత్నం చేస్తే పోతుంది. దానికి నీ ప్రయత్నం ఉండాలి, కాలం కలిసిరావాలి, గురువుఅనుగ్రహం ఉండాలి. విధి బలీయమైనది. విధి ఒకోసారి ఎలా చేస్తుంది అంటే ధర్మరాజు మనకంటే వెయ్యి రెట్లు గొప్పవాడు అందులో సందేహం లేదు. జూదం ఒక వ్యసనం, అది అలవాటు అయిపోయింది. ఒకసారి జూదంలో నష్టపోయాడు. ధర్మరాజును మాయ చెయ్యటానికి, మరల జూదం ఆడదామని కబురు పంపించారు. ఇందులో మాయ ఏదో ఉంది, మన రాజ్యం పోతుంది అని ఎంతో కొంత ధర్మరాజుకు తెలుసు, కాని జూదం అనే బలహీనత ఆయనను తీసుకొని వెళ్ళింది, మరల ఓడిపోయాడు. జూదం ఆడినంతమాత్రాన ధర్మరాజు చెడ్డవాడు అని కాదు, ఆయన మంచివాడే కాని విధి బలీయమైనది, తీసుకొని వచ్చి జూదం ఆడించింది, జూదంలో ఓడిపోవటం, అరణ్య వాసానికి వెళ్ళటం, తరువాత కౌరవ పాండవ యుద్ధం జరగటం, కౌరవులు నశించటం, మరల ధర్మరాజు పరిపాలన చేయటం ఇదంతా విధి అలా నడిపించింది. ప్రపంచంలో ఎక్కడ ఏది జరిగినా దానిని ప్రోపర్‌గా అర్థం చేసుకోవటం కష్టం, విమర్శించటం చాలా తేలిక. మనకు సరిగా అర్థం చేసుకొనే బుద్ధి ఉండాలి. అన్ని మంత్రాలలోకి గాయత్రి మంత్రం గొప్పది. మంచి మార్గంలో నడవాలంటే నాబుద్ధి బాగుపడాలి, అటువంటి మంచిబుద్ధిని నాకు ఇచ్చి మంచిమార్గంలో నడిపించమని గాయత్రి మంత్రం అర్థం. ప్రపంచంలో అనేక ఆకర్షణలు ఉన్నాయి. వాటిలో పడకుండా నన్ను రక్షించి, నేను ఏరకంగా జీవిస్తే భగవంతుడిలో ఐక్యమవుతానో అటువంటి బుద్ధిని ప్రసాదించమని గాయత్రి మంత్రం అర్థం.

మన బుద్ధి మంచిది కాదు అనుకోండి, మనకు బుద్ధిసూక్ష్మత లేదు అనుకోండి మీరు భగవద్గీత ఎన్నిసార్లు చదివినా అది మీకు అర్థంకాదు, శాస్త్రం తన హృదయాన్ని మీకు ఇవ్వదు. కృష్ణుడు ఏ చైతన్యస్థాయిలో భగవద్గీత చెప్పాడో ఆ స్థాయి మనకు వచ్చినప్పుడే గీత మనకు అర్థమవుతుంది అంతేగాని మన పాడుబుద్ధికి గీత అర్థం కాదు. అయ్యో మనకు గీత అర్థం కావటం లేదు, దానిని అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేయాలి అని మనం అనుకోవటం లేదు, గీతలో పొరపాట్లు ఉన్నాయి అనుకొంటున్నాము. మనకు బాహ్యంగా ఏది ఉన్నా స్వప్నంతో సమానము. మన మనస్సు ఎంత నిజమో బాహ్యంగా జరిగే సంఘటనలు కూడా అంతే నిజం. మనకు గౌరవం ఉంది అనుకోండి, గౌరవం ద్వారా మన మనస్సు

బాగుపడాలి. గౌరవం ద్వారా మనస్సు బాగుపడకపోతే గౌరవం ఏమి చేసుకొంటాము. మనస్సుకు లోచూపు కలగకుండా ఆత్మజ్ఞానం రాదు. మన మాటద్వారా, చేతద్వారా మనస్సుకు లోచూపు కలగాలి, మనస్సు హృదయాభిముఖంగా ప్రయాణం చేయాలి, ఆ రకంగా ప్రయత్నం చేయటమే సాధన. ముందు మనం శాస్త్రాన్ని అధ్యయనం చేయాలి, దానిని అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేయాలి. అర్థమైతే ఆచరించాలి అనే బుద్ధి కలుగుతుంది, ఆచరించిన తరువాత అనుభవంలోనికి వస్తుంది. భగవంతుడు తప్పించి అన్నీ అసత్యమే. చదువు, డబ్బు, గౌరవం ఇవి అన్నీ మనో దేహములు ఎంత నిజమో అవికూడా అంతే నిజం, నీ దేహప్రారబ్ధాన్ని బట్టి అవి వస్తాయి. నీ సంకల్పంతో సంబంధం లేకుండా దేహప్రారబ్ధంలో ఏది ఉంటే అది వచ్చేస్తుంది. ఎవరి దేహం ద్వారా ఏపని చేయించాలో భగవంతుడు చూసుకొంటాడు, అది అలా జరిగిపోతూ ఉంటుంది, ఆ పని నుండి మనం తప్పించుకోవాలి అని చూసినా అది ఆగదు. నీ దేహం ద్వారా ఏ పని అయితే జరుగుతోందో దానిని అయిష్టంగా చెయ్యవద్దు, ఇష్టంతో చెయ్యి, అది కూడా సాధనే. దేవుడి ఇష్టాన్ని నీ ఇష్టంగా చేసుకొంటే అప్పుడు రెండు లాభాలు పాత వాసనలు పోతాయి, కొత్త వాసనలు రావు. వ్యర్థమైన మాటలు మాట్లాడటం, వ్యర్థమైన పనులు చేయటం, వ్యర్థమైన తలంపులు, వ్యర్థమైన ఆలోచనలతో కాలక్షేపం చేస్తూ జనం చనిపోతున్నారు. మీ ఇంటికి చుట్టాలు వస్తే మీ ఇంట్లో ఉన్న రూపాయి కాగితాలు పొయ్యిలో పెట్టి కాఫీ కాచి ఇవ్వటం ఎలా ఉంటుందో వ్యర్థమైన ఆలోచనలతో, పనులతో మీ జీవితం గడపటం కూడా అలాగే ఉంటుంది అని చెపుతున్నారు.

రూపచింతన, నామచింతన తగ్గించుకోండి. రూపనామములే మనలను బంధిస్తున్నాయి. దేహప్రారబ్ధంలో ఏదో ఒకటి జరుగుతూ ఉంటుంది, ఏది జరిగినా అది అబద్ధమే. నీదేహం ఎంతనిజమో, మనస్సు ఎంత నిజమో జరిగే సంఘటనలు కూడా అంతే నిజం. సత్యసాక్షాత్కారం కోసం ప్రయత్నం చేయటం మానేసి గతించిన గొడవలు తలపెట్టుకోవటం వలన కాలము, శక్తి వృధా అవుతాయి, ఈలోపు ఏదో రోజు మరణం వస్తుంది చనిపోతావు. నిజమైన గురువు నీలోపలే ఉన్నాడు. నీకు దేహభావన ఉండటం వలన, బయట దేహంతో ఉన్న గురువు అవసరం అవుతున్నాడు. గురువు అంటే ఆత్మే, ఈశ్వరుడే. గురువుకు దేహం ఉంటుంది కాని దేహంతో తాదాత్మ్యం ఉండదు, తాను దేహమాత్రుడను కాదు అని ఆయనకు తెలుసు. మనకోసం వేషం వేసుకొని వచ్చిన దేహం అది. తనువు తాను కాదని తెలిసిన వాడికి జపమేల, తపమేల, ధ్యానమేల ఓరామా! శ్రీరామ అంటాడు త్యాగరాజు. మీరు ఇంటి దగ్గర రోజూ ఎక్కౌంట్లు ఎలాగ చూసుకొంటున్నారో అలాగ మీరు ఎంతవరకు వైజర్ అండ్ ప్యూరర్ అయ్యారో ఏరోజుకారోజు చూసుకోండి. ఎంతవరకు

బుద్ధిసూక్ష్మత పెరుగుతోంది, ఎంత వరకు పవిత్రులం అయ్యాము అని ఏరోజుకారోజు చూసుకోవాలి. రోగం వచ్చిన తరువాత బాగుచేసుకోవటం కంటే రోగం రాకుండా చూసుకోవాలి. అలాగే మనస్సుకు చాపల్యం వచ్చిన తరువాత నిగ్రహించుకోవటం కాదు, అసలు మనస్సుకు ఎందుకు చాపల్యం వస్తోంది అని చూసుకొని ఆ కారణాన్ని తగ్గించుకోండి. రాగద్వేషములు లేకపోతే మీ మనస్సు కదలదు. రాగరహితస్థితి, ద్వేషరహితస్థితి మీరు పొందారు అనుకోండి అసలు మీ మనస్సుకు చాపల్యంతో పనిలేదు. ఈ ప్రపంచంలో ఎక్కడికి వెళ్ళి చూసినా రాగద్వేషములు తప్పించి ఏముంది అన్నాడు గౌతమబుద్ధుడు. ఈ లోకంలో చాలామంది మంచిపనులు చేస్తారు కాని పుణ్యం వస్తుందని చేస్తారు, లేకపోతే ఆపని చెయ్యరు. పుణ్యం ప్రధానం కాదు. మీరు చేసే పని ద్వారా అసలు మీ మనస్సు బాగుపడుతోందా, మీ మనస్సు పవిత్రం అవుతోందా లేదా అనేది జాగ్రత్తగా చూసుకోవాలి. మన శరీరం ఏదోరోజు చనిపోతుంది. అప్పుడు నూటికి నూరు పాళ్ళు మనస్సులో క్షోభ ఉండకూడదు. మనస్సులో క్షోభ మిగిలిపోతే పునర్జన్మ వచ్చేస్తుంది.

మన జీవితాలు అన్నీ తీసేసిన సినిమాలు వంటివి. ఈ శరీరం ఏ పని నిమిత్తం ఈ భూమి మీదకు వచ్చిందో ఆ పని పూర్తి అయ్యాక శరీరం చనిపోతుంది. ఈలోపు ఈ శరీరం ద్వారా జరగవలసింది జరిగిపోతూ ఉంటుంది, నువ్వు దానితో తాదాత్మ్యం పొందవద్దు. దానితో తాదాత్మ్యం నీకు లేనప్పుడు బాహ్యవిషయాల ద్వారా ఏదైనా సంతోషం వచ్చినా పొంగిపోవు, దుఃఖం వచ్చినా కృంగిపోవు. మీరు రెండు మూడు గంటలు పూజలు చేసేసి సంతోషం వస్తే పొంగిపోతూ, దుఃఖం వస్తే కృంగిపోతూ ఉంటే మనస్సు బలహీనపడి మనోచాపల్యం పెరిగిపోతుంది. బాహ్యవస్తువులతో తాదాత్మ్యం వలన మనస్సుకు లోచూపు రాదు. లోచూపు కలుగకపోతే ఆత్మజ్ఞానం కలుగదు, ఆత్మశాంతి మనకు అందదు. ఆత్మానుభవం పొందటమే మన జీవిత గమ్యం, అంతవరకు పునర్జన్మలు ఆగవు. మనం ఏదిగా ఉన్నామో ఆ వస్తువు తాలుక అనుభవం మనం పొందాలి, దానితో ఏకం కావాలి. ఆ అనుభవం పొందేవరకు ఈ ప్రయాణాలు తప్పవు. సుఖంకోసం, శాంతికోసం కంగారుపడకండి. ఈ దేహంతో తాదాత్మ్యం తగ్గించుకొంటే మీరు భరించలేనంత సుఖం, శాంతి ఇప్పుడే వచ్చేస్తాయి. నువ్వు వేరు, నేను వేరు అనే బేదబుద్ధి మనకు ఉంది, అదే పాపం. ఇంక మనం ఏమి బాగుపడతాము. ఇతరులలో లేని ప్రత్యేకత ఏదో నాలో ఉంది అని మీరు అనుకొంటున్నారు అనుకోండి. లోపల పాపం ఉంది కాబట్టి మీకు అటువంటి తలంపులు వస్తున్నాయి. నీ పాడుబుద్ధి వలన నీకు ఆత్మజ్ఞానం రాదు, బేధబుద్ధి వలన నీకు ఆత్మజ్ఞానం కలుగదు. దేహంతో తాదాత్మ్యం పొందే బుద్ధికి ఆత్మజ్ఞానం రాదు. ఇక్కడ పరమాత్మ

ఏమి చెపుతున్నాడు అంటే నన్ను స్మరించగా స్మరించగా, నీ ఇష్టాయిష్టాలను ఒక ప్రక్కనపెట్టి నాకు ఇష్టమైన పనిని చేస్తూ, ఆ పనిని నాకు అర్పించి పని చేస్తూ ఉంటే, ఆ రకంగా నీవు జీవిస్తూ ఉంటే నీకు ఎటువంటి బుద్ధిని ప్రసాదిస్తే ఆత్మజ్ఞానం కలుగుతుందో అటువంటి బుద్ధిని నేను నీకు ఇస్తాను అని పరమాత్మ చెపుతున్నాడు. నీ తెలివితేటల వలన సంపాదించుకోలేవు, దానికి నీ తెలివి సరిపోదు. మనం మంచి పనులు చేస్తాము కాని భగవంతుడికి అర్పించుకోవటం లేదు, మన అహంకారానికి అర్పించుకొంటున్నాము. కొంతమంది కృత్రిమ గౌరవాలకోసం పనిచేస్తూ జీవితాన్ని పాడు చేసుకొంటారు. మీకు చదువులేదు అనుకోండి, డబ్బు లేదు అనుకోండి. వాటి గొడవ మీకు వద్దు. గురువు మీద ఉన్న ఇష్టం వలన, ప్రేమ వలన, మానసికఅనుభవం వలన మీకు జ్ఞానం వచ్చేస్తుంది, గురువుతో ఉన్న అనుబంధం వలన లోపల ఉన్న వస్తువు మీకు అనుభవంలోనికి వస్తుంది. ఆ వస్తువు నాకు తెలియబడాలి అని నీవు అనుకొంటే అది తెలియబడదు. అది ఎవరికి తెలియబడాలి అనుకొంటుందో వారికి మాత్రమే తెలియబడుతుంది. వీడు పవిత్రుడు అయ్యాడు, వీడికి బాగా మెచ్యూరిటీ వచ్చింది అని ఆయన అనుకోవాలి, అనుకొంటే అప్పడు ఆయన తెలియబడతాడు, వాడు ఈశ్వరుడు. అప్పడు నిన్ను బంగారంతో అలంకరించటం కాదు, ఆత్మసుఖంతో నిన్ను అలంకరిస్తాడు. మీరు ఇంట్లో బంగారం పెంచుకోవటం కోసం కృషి చేసుకోవచ్చు కనీసం అందులో వందోవంతు అయినా మీ మనస్సును బంగారం చేసుకోవటానికి కృషి చేస్తున్నారా? లేదు. ఇంట్లో బంగారం ఉంటే మోక్షం రాదు, మనస్సు బంగారం అయితే మోక్షం వస్తుంది.

ఈ అజ్ఞానం పోవాలి, ఈ మూర్ఖత్వం పోవాలి అని అనుకొంటే అవిపోవు. అందులోనుండి విడుదల పొందటానికి ప్రయత్నం చేయాలి. అద్దం మురికిగా ఉంది అనుకోండి అందులో మన మొఖం సరిగా కనబడదు. ఆ మురికిని, దుమ్మును శుభ్రంగా దులిపేసాము అనుకోండి అప్పడు మన మొఖం స్పష్టంగా కనిపిస్తుంది, అలాగే నీవు ప్రయత్నం చేసి నీలో ఉన్న మూర్ఖత్వాన్ని, అజ్ఞానాన్ని తొలగించుకొంటే నీ హృదయంలో ఉన్న పరమాత్మ నీకు గోచరిస్తాడు. మనం ప్రయత్నం చేస్తున్నాము అనుకోండి, గురువు చూస్తూ ఉంటాడు. ఎప్పడో టైము చూసుకొని కొన్ని క్షణాలలో నిన్ను అజ్ఞానంలో నుండి విడుదల చేస్తాడు, అది గురవు యొక్క దయ, అది మాటలతో చెపితే నీకు తెలియదు, మీ అనుభవంలోనికి వచ్చినప్పడు అది తెలుస్తుంది. మంచివాడు కూడా ఒకోసారి చెడ్డపని చెయ్యవచ్చు వాడిలో ఉన్న వాసన చెడ్డ పని చేయిస్తుంది. అంతమాత్రంచేత వాడు చెడ్డవాడు కాదు. మంచివాడికి

చెడ్డవాడికి తేడా ఏమిటి అంటే మంచివాడు ఈ పొరపాటు మాట ఎందుకు ఇలా అన్నాను, ఎందుకు ఈ చెడ్డపని చేసాను అని వెంటనే సర్దుకొంటాడు, చెడ్డవాడు పొరపాటును ఇంక సర్దుకోడు. మనసులో మంచితనం లేకపోతే ఇంక ఆ పొరపాటులో నుండి బయటకురాలేడు. మనకు ఎప్పుడైనా కోరిక వస్తే అది ఒక్కటే నిజం అనిపిస్తుంది, ఎప్పుడైనా ద్వేషం వస్తే అదొకటే నిజం అనిపిస్తుంది, మనకు ఏదైనా తినాలి అనిపిస్తే అదొకటే నిజం అనిపిస్తుంది, దొంగతనంగా తినేస్తాము. మనకు ఏ తలంపు వస్తే తాత్కాలికంగా అదొకటే నిజం అనిపిస్తుంది.

భగవాన్ విరూపాక్షగుహలో ఉండగా ఫళనిస్వామి ఉండేవారు. ఆయన చాలా వైరాగ్య పురుషుడు. స్త్రీలు అంటే ఆయనకు ఇష్టం ఉండేదికాదు, భగవాన్ దగ్గర వాళ్లమ్మ కూర్చొన్నా ఇష్టం ఉండేదికాదు. భగవాన్ స్కందాశ్రమంకు వెళ్లినప్పుడు నువ్వు వంట పెట్టేసావు, నువ్వు సంసారివి అయిపోయావు, నీకూడా రాను అని భగవాన్‌తో చెప్పారు. నువ్వు నాకు ఎంత సేవ చేసావో నాకు తెలుసు. నువ్వు నన్ను మర్చిపోయినా, నేను నిన్ను మర్చిపోను అన్నారు భగవాన్. ఆయన దేవుడు. భగవాన్ విరూపాక్షగుహకు వచ్చి ఫళనిస్వామిని పలకరించి వెళ్లేవారు. మనకు ఎవరైనా మంచి చెయ్యవచ్చు, చెడ్డ చెయ్యవచ్చు. వారు చేసిన మంచే మనం జ్ఞాపకం పెట్టుకొందాము అనేవారు భగవాన్. ఫళని ఇంకా నాలుగు రోజులకు చనిపోతాడు అనగా ఎవరో మామిడిపండు తెచ్చి ఇచ్చారు. ఆయన జ్వరంతో బాధపడుతున్నాడు, అంత వైరాగ్యమూర్తికి ఆ మామిడిపండు తినాలనిపించింది, ఇదే మాయ. ఆ కాయను శుభ్రంగా కడిగి ముచ్చిక తీసుకొని ఇంక తినాలనుకొంటున్నాడు, అంతలో భగవాన్ రావటం చూసాడు, ఆ మామిడిపండును దాచేసాడు. భగవాన్ వచ్చి కూర్చొని ఏమిటి ఫళని ఆరోగ్యం ఎలా ఉంది, జ్వరం ఇంకా తగ్గలేదా అని అడిగారు. తరువాత ఫళని ఏమిటి మామిడిపండు వాసన వస్తోంది అన్నారు. మామిడిపండు లేదు, ఏమీ లేదు అని చెప్పాడు. భగవాన్ ఉద్దేశ్యం ఏమిటి అంటే నేను వెళ్లిపోతే ఆ మామిడిపండు తినేస్తాడు, జ్వరం పెరిగిపోతుంది. ఆ మామిడిపండు ఎక్కడ ఉందో భగవాన్‌కు తెలుసు. భగవాన్ అటు ఇటు తిరిగి వెతికి ఆ మామిడిపండు తీసి శుభ్రంగా తినేసి బయట పడేసి వెళ్లిపోయాడు. ఇంతకీ ఆ అబద్ధం పదికోట్లు సంపాదించటానికా? కాదు, ఆ మామిడిపండు తినటానికి. మామిడిపండు తినాలనే కోరిక అబద్ధం చెప్పించింది. ఇదే మాయ. ఫళని అబద్ధం చెప్పాడని ఆయన తక్కువవాడు అని అనుకోవద్దు, మనకంటే కోటిరెట్లు గొప్పవాడు. అందుకే పరమాత్మ చెప్పాడు నాదయ లేకుండా, నా పాదాలను ఆశ్రయించకుండా ఎవరూ నా మాయలో నుండి బయటకు రాలేరు అని చెప్పాడు. మాయ చేతిలో మనం ఉంటాము. భగవంతుడి

చేతిలో మాయ ఉంది. అందుచేత ఆయనను ఆశ్రయించటం వలన మాయ దారి ఇస్తుంది. మన ప్రేమగాని, భక్తిగాని, ఆప్యాయతగాని బయట కనిపించనక్కరలేదు. మురుగనార్ భగవాన్ భక్తుడు. భగవాన్ హాలులో కూర్చొన్నప్పడు మురుగనార్ ఎక్కడో దూరంగా, బాగా వెనకాల కూర్చొనేవాడు. భగవాన్ ఏదైనా పని ఉండి పిలిస్తే దగ్గరకు వెళ్ళేవాడు లేకపోతే వెనకాల కూర్చొనేవాడు. మురుగనార్‌కు భగవాన్ అంటే చాలా ఇష్టం, భగవాన్‌కు కూడా మురుగనార్ అంటే ఇష్టం కాని అవసరమైతే మాట్లాడుకొనేవారు, బాహ్యంగా చూస్తే ఒకరిమీద ఒకరికి ప్రేమ ఉన్నట్లు మనకు తెలియదు, లోపలకు వెళ్ళి చూస్తే వారిది విడదీయలేని ప్రేమ. మురుగనార్‌కు గురువుపట్ల ఎటువంటి భక్తి ఉందో, ఎటువంటి ప్రేమ ఉందో, ఎటువంటి విశ్వాసం ఉందో మనం కూడా గురువు పట్ల అటువంటి భక్తిని, విశ్వాసాన్ని, ప్రేమను అలవర్చుకోవాలి. బాహ్యానికి ప్రదర్శన కోసం ఏమీ నటించనక్కరలేదు. స్నేహం అనేది నటించేది కాదు, అది ఒకరకమైన మాధుర్యం. నీ మనస్సు ఎవరితో శృతి కలుపుతోందో, ఎవరిని స్మరించటం వలన నీ మనస్సు అణుగుతోందో, ఎవరి సాన్నిహిత్యం వలన నీ మనస్సు హృదయాభిముఖంగా ప్రయాణం చేస్తోందో వాడే నీ గురువు. మనం గురువును ఎన్నుకోవటం వేరు, గురువు మనలను ఎన్నుకోవటం వేరు. మనం గురువును ఎన్నుకొంటే జారిపోవచ్చు, గురువు మనలను ఎన్నుకొంటే జారిపోయే ప్రమాదం లేదు. అది పులినోట్లో పడ్డ మాంసపు ముక్క. తాను ఏ స్థితిలో అయితే ఉన్నాడో ఆ స్థితిని అనుగ్రహించే వరకు నీవు ఏ జన్మలో ఉన్నా నిన్ను గురువు విడిచిపెట్టడు.

సమాజంలో సహనం తగ్గిపోయింది. మన ఇంట్లో, సమాజంలో ఎక్కడ చూసినా పేచీలు, అసలు సహనం కనబడటం లేదు. మీ అత్తగారు మిమ్మల్ని నాలుగు తిట్టింది అనుకోండి, మీరు పుట్టింటికి వెళ్ళి చెపుతారు. నీవు కూడా తిరిగి నాలుగు మాటలు అనవలసింది అని తల్లి చెపుతుంది. ప్రస్తుతం మన పరిస్థితి ఇలా ఉంది. అత్తగారు నాలుగు మాటలు అంది, ఏదో పెద్దావిడ అంది, ఓర్చుకొంటే సరిపోతుంది అని తల్లి చెప్పాలి, అలా చెప్పటం లేదు. మనం ఎవరి ఇంటికి వెళ్ళి చూసినా నాలుగు కాసుల బంగారం ఉంటుంది కాని ఎవరి ఇంటిలోను సహనం కనబడటం లేదు. ఎప్పుడైతే సహనం తగ్గిపోయిందో సబ్జక్టును అర్థం చేసుకొనే శక్తి తగ్గిపోతుంది. మనం మాట్లాడేటప్పుడు, స్నేహాలు చేసేటప్పుడు, వ్యవహారంలో, మన ప్రవర్తనలో వివేకాన్ని విడిచిపెట్టకూడదు. శాంతి అనేది, జ్ఞానం అనేది బజారులో ఎక్కడ లేదు, అది లోపల నుండి రావాలి. నీ హృదయం యొక్క లోతులు పెంచుకొంటూ ఉంటే, నీవు హృదయాభి ముఖంగా లోపలకు ప్రయాణం చేస్తూ ఉంటే ఆ వైభవం అంతా లోపల నుండే వస్తుంది. నీవు ఏదైతే పొందాలి అనుకొంటున్నావో అది

బయట లేదు, నీ లోపలే ఉంది. బాహ్య గొడవలు జ్ఞానాన్ని తెచ్చిపెట్టవు, ఉపద్రవాలను తెచ్చిపెడతాయి, చివరకు ఏదో రోజున అవి మనలను ముంచేస్తాయి. అందరిలోను నీ గురువునే చూడటానికి ప్రయత్నం చెయ్యి. నిజం ఎలా ఉంటుందో మనకు తెలియదు కాని గురువుకు తెలుసు. నిజం దగ్గరకు మనలను తీసుకొని వెళ్ళే వరకు వేటగాడు జంతువులను ఎలా వెంటాడుతాడో అలాగ గురువు మనలను వెంటాడుతూ ఉంటాడు. భగవంతుడికి గురువుకు ఒక తేడా చెప్తారు. భగవంతుడు మామిడిపండు అయితే అందులో ఉన్న రసం గురువు. మామిడి పండులో తొక్క, టెంక, పీచు, రసం అన్నీ ఉంటాయి. గురువు అంటే టెంక కాదు, తొక్క కాదు, కేవలం రస స్వరూపుడే గురువు. భగవంతుడు కర్మఫలదాత. నీవు చేసిన మంచికి మంచి, చెడ్డకు చెడ్డ ఫలితాన్ని ఇస్తాడు. గురువు అలా కాదు. నీ ముక్కు వంకరగా ఉంటే వంకరగా ఉందని చెప్పడు, నీతో చెప్పకుండా ఆ వంకరను తీసేస్తాడు. నీ మనస్సు బాహ్యముఖానికి పోతోంది అనుకో ఏ కారణాల వలన నీ మనస్సు బాహ్యముఖమవుతోందో నీకు చూపించి ఆ కారణాలను తొలగిస్తాడు, వాడు గురువు. నీలో ఆ దోషం ఉంది, ఈ దోషం ఉంది అని గురువు చెప్పడు. ఆయనకు మాటలతో పని లేదు. నీకు తెలియకుండానే ఆ దోషాలను తొలగిస్తాడు. మీరు అలా ఉన్నారు, ఇలా ఉన్నారు అని చెప్పడు. అలా ఉండమని, ఇలా ఉండమని చెప్పడు. మీరు ఏదిగా ఉన్నారో ఆ స్థితిలోనికి మిమ్మల్ని గెంటుకొని పోతాడు. వాడు గురువు. గురువు దగ్గర నుండి వచ్చే సహాయ సహకారములు అర్థం చేసుకొనే బుద్ధిసూక్ష్మత మనకు లేదు. గురువు ఏ స్థితిలో అయితే ఉన్నాడో ఆ స్థితిని మనం పొందాక గురువు చేసిన సహాయం, గురువు యొక్క దయ ఏమిటో మనకు అర్థం అవుతాయి కాని అప్పటివరకు మనం ప్రయత్నం చేసినా అర్థం కాదు. గురువు జడ్జిమెంట్లు చెప్పడు. నీ మనస్సును సంస్కరించి ఆత్మాకారం చెందేటట్లు చేస్తాడు, వాడు గురువు. గురువు మనకు సహాయం ఎలా చేస్తాడు, ఎప్పుడు చేస్తాడు అనేది ముహూర్తం ఆయనే పెట్టుకొంటాడు. మనం సహనంగా ఉంటే సరిపోతుంది. హృదయశుద్ధి కలవారు ధన్యులు వారు దేవుని చూచెదరు అని ఏసుక్రీస్తు చెప్పాడు. హృదయంలో ఉన్న సత్యం మీకు గోచరించే వరకూ మీకు శాంతి లేదు, సుఖం లేదు. హృదయంలో ఉన్న శాంతి స్థానాన్ని మనం చేరుకోవాలి. హృదయశుద్ధి ఉన్నవారు మాత్రమే అక్కడకు చేరుకోగలరు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 11-03-2007, చించినాడ

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

నిప్పుకు వేడి అనేది గుణం కాదు, అది సహజం అలాగే సహనం అనేది ఒక గుణం

క్రింద కాకుండా మనకు సహజం అవ్వాలి. సహనం వలన హృదయం యొక్క లోతులు పెరుగుతాయి, మనస్సు యొక్క చాపల్యం తగ్గుతుంది, రాగద్వేషాలు పల్చబడతాయి. మిమ్మల్ని చూసి ఇతరులు అసూయపడుతున్నారు అనుకోండి మనకు సహనం ఉంటే దానిని తేలికగా అతిక్రమించవచ్చు. సహనం వలన శక్తి పెరుగుతుంది. మీకు సహనం ఉంటే ఇంట్లో గడప ఎలా దాటుతామో అలాగ ఈ ప్రకృతి విషయాలను చాలా తేలికగా అతిక్రమించవచ్చు. సజ్జన సాంగత్యం వలన సహనం పెరుగుతుంది. సజ్జనసాంగత్యం వలన ఒక్క సహనమే కాదు అన్నీ సాధించవచ్చు అని తులసీదాసు చెప్పాడు. కాని సజ్జనసాంగత్యం దొరకటం చాలా కష్టం. సజ్జనసాంగత్యం వలన మన ప్రయత్నం ఎక్కువ లేకుండానే జిజ్ఞాస, ముముక్షత్వం అన్నీ సమకూరుతాయి, మనకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. జన్మాంతరంలో నుండి మనం తెచ్చుకొన్న మూర్ఖత్వంలో నుండి విడుదలపొందటమే తపస్సు యొక్క ప్రయోజనం, వాసనా రహిత స్థితిని పొందటమే తపస్సు యొక్క ప్రయోజనం. మనం ఈ సృష్టిలోనికి ఎందుకు వచ్చామో ఆ పని పూర్తిగా మర్చిపోయాము. కాలాన్ని, శక్తిని వృధా చేసుకొంటున్నాము. మన శరీరానికి చావు వస్తుంది అనగా అప్పుడు ఈ సృష్టిలోనికి వచ్చిన ప్రయోజనం ఏమిటో గుర్తుకు వచ్చినా మనం ఏమీ సాధించలేము. అప్పుడు శరీరం ముసలిదైపోతుంది, సాధనకు ఉపయోగపడదు. మరణసమయంలో నన్ను స్మరించినవారు ధన్యులవుతారు, నన్ను పొందుతారు అని పరమాత్మ చెప్పినా, జీవితం పొడుగునా ఆయనను స్మరిస్తే, ఆయన చెప్పినట్లు వివేకంగా వైరాగ్యంతో జీవిస్తే మరణసమయంలో ఆయన గుర్తుకు వస్తాడు గాని లేకపోతే మరణసమయంలో భగవంతుడు గుర్తుకురాడు, ఆయన స్మరణ రాదు. అది ఒక రోజులో రెండు రోజులలో వచ్చేది కాదు. అనేక జన్మల కృషివలన గాని చిత్తశుద్ధి కలుగదు.

శాస్త్రజ్ఞానం ఆత్మజ్ఞానం అనుకొంటున్నారు, ఈ రాంగ్‌థింకింగ్‌లో నుండి మానవజాతిని బయటకు తీసుకొని రావటానికి వచ్చిన అవతారమే రమణావతారం. దక్షిణామూర్తి వైభవం మనం పురాణాలలో చదువుతున్నాము కాని కళ్ళతో చూడలేదు. దక్షిణామూర్తి వైభవం చూపించినవాడు రమణ మహర్షి, మౌనంలో బోధించి వస్తువును ఎరుకలోనికి తీసుకొని వచ్చాడు, మౌనబోధ. భగవాన్ విరూపాక్షగుహలో ఉండగా అక్కడకు వచ్చినవారు ఆయనకు శాస్త్రజ్ఞానం లేదు అని అనుకొనేవారు ఎందుచేతనంటే ఆయన మౌనం వారికి అర్థంకాక, శాస్త్రంలో ఏ వస్తువును అయితే అనుభవంలోనికి తెచ్చుకోమని చెప్పారో ఆ వస్తువే అక్కడ ఉంది అని వారికి గోచరించక, గ్రహించే అర్హత వారికి లేక శాస్త్రజ్ఞానం లేనివాడు అనేవారు. మనకు ఉపయోగపడే విషయాలను వదిలేస్తాము, మిగిలిన

అన్ని విషయాలను గ్రహిస్తాము, చనిపోయేవరకు మనందరం చేసే పని ఇదే, అందుచేత మనం సాధకులం కాదు. సాధకుడు అనేవాడు ఆత్మజ్ఞానం పొందటానికి సహకరించే మాటలను శ్రవణం చేయాలి, మిగిలిన విషయాలను శ్రవణం చేయకూడదు, వాటిని గ్రహించకూడదు. ఎవరైనా అవసరం లేని మాటలు మాట్లాడుతూ ఉంటే భగవాన్ వెంటనే కట్‌చేసేవారు, అది జ్ఞానమా అనేవారు, రెండోమాట రానిచ్చేవారు కాదు. మనకు ఆత్మజ్ఞానం లేకపోవచ్చు, ఆత్మానుభవం పొందిన వారిని గౌరవించే స్థాయి కూడా మనకు లేదు. అవసరంలేని విషయాలను మనం గ్రహించటం తగ్గించుకొంటే కాలం, శక్తి కలసివస్తాయి, మనం బాగుపడతాము. కోరికకు, ప్రేమకు ఏమీ సంబంధం లేదు. ప్రేమకు వ్యాపారంతో సంబంధం లేదు కోరికకు వ్యాపారం ఉంటుంది, ఆ వ్యాపారంలో నుండి కోపం వస్తుంది, కోపం వచ్చినప్పడు బుద్ధిలో ఉన్న విచక్షణ తగ్గిపోతుంది. సంసారం అంటే మార్పు, నిరంతరం మార్పు చెందేదే సంసారం. జ్ఞానం గురించి మీరు బాగా శ్రవణం చేయాలి. శ్రవణం చేయగా చేయగా దాని ప్రాముఖ్యత మీకు తెలుస్తుంది. శ్రవణం లేకపోతే మననం లేదు, మననం లేకపోతే నిధిధ్యాస లేదు. మనస్సును నిర్మలంగా ఉంచటానికి ప్రాణాయామం కూడా సహకరిస్తుంది. స్థూలబుద్ధి ఉన్నవారికి ప్రాణాయామం కొంతవరకు సహకరిస్తుంది, బుద్ధిసూక్ష్మత ఉన్నవారికి ప్రాణాయామంతో పని లేదు.

శరీరం చనిపోయినప్పడు మనకు అందరకు భయం కలుగుతుంది. ఎక్కడికో వెళ్ళిపోతున్నాము, ఆ వెళ్ళే చోటు మనకు తెలియదు అందుకు భయం కలుగుతుంది. మనకు దేహబుద్ధి నశించింది అనుకోండి ఇంక లోకంతో పనిలేదు. మనస్సు వేరు, దేహం వేరుకాదు, మనస్సు యొక్క స్థూలరూపమే దేహం. అందుచేత నీ మనస్సు మీద వచ్చే ప్రభావం అంతా దేహం మీదకు వచ్చేస్తుంది. నీకు ప్రేమ ఉందా, ద్వేషం ఉందా అంటే నీ కళ్ళను చూస్తే తెలుస్తుంది. మీ మనస్సులో అశాంతి ఉంది అనుకోండి మీరు ఎంత దాచుకొందాము అనుకొన్నా అది మీ మొఖంలోనికి వచ్చేస్తుంది. మనలో ఏ ఔన్నత్యం అయితే లేదో, ఏ స్థాయి అయితే మనలో లేదో అది మనలో ఉన్నట్లు బయట కనిపించాలి అని మనం అనుకొంటాము. మనలో లేనిది ఉన్నట్లుగా బయట కనిపించాలి అనుకొంటాము, అది మానవుడిలో ఉన్న పెద్ద బలహీనత. మనం మంచివాడు కాకపోయినా మంచివాడు అని లోకం చెప్పకోవాలి అనుకొంటాము, ఇంక మనకు జ్ఞానం ఏమిటి? దేహాభిమానం ఉన్నవాడికి లోపల ఉంది, బయట ఉంది. దేహాభిమానం నశిస్తే లోపల లేదు, బయట లేదు. ఇదంతా నీ మనస్సు కల్పిస్తోంది. దేహబుద్ధి లేనివాడు ఈ లోకంలో ఉండవచ్చు కాని వాడు ఈ లోకంలో ఒక భాగం కాదు, వాడు ఈ లోకంలో ఉన్నా లేనివాడితో సమానము. సూర్యుడు ఉన్నాడు,

ఆయనకు నమస్కారం పెట్టేవాడికి వెలుగు ఇస్తున్నాడు, ఆయన మీద ఉమ్మి వేయటానికి ప్రయత్నం చేసేవాడికి వెలుగు ఇస్తున్నాడు, అందుచేతనే ఆయన సూర్యనారాయణుడు అయ్యాడు. ప్రపంచం అనిత్యం, అసుఖం. ఈవేళ మనందరం బాగున్నాము, రేపు ఎలా ఉంటామో మనం చెప్పలేము. ప్రపంచంలో ఏదీ నిత్యంగా ఉండదు, ఎవరు సుఖంగా ఉండరు. సుఖం, శాంతి అంతా నీ హృదయంలోనే ఉంది, లోకంలో ఏమీ లేదు. లక్షలాది జన్మలనుండి మనం చేస్తున్న పొరపాటు ఏమిటి అంటే ఎక్కడైతే సుఖం లేదో అక్కడ సుఖం కోసం వెతుకుచున్నాము, ఎక్కడైతే సుఖం ఉందో అక్కడ వెతకటం మానివేసాము. అందుచేత మనకు సుఖం దొరకటం లేదు. మనం అనుకొనే మంచిచెడ్డలకు, జననమరణాలకు, పుణ్యపాపాలకు లోపలఉన్న సద్వస్తువుకు ఏమీ సంబంధం లేదు. అది ముందు మనకు గ్రహింపులోనికి రావాలి. నీ మనస్సును బాగుచేసు కోవటం కంటే ముఖ్యమైన పని ఈ లోకంలో ఏదీ లేదు, అది మనకు తెలియకపోవటం వలన ఏదో ఉంది అనుకొంటున్నాము.

ఏదైనా ఒక విషయం గురించి చదవటం వేరు, అర్థం చేసుకోవటం వేరు. అర్థం చేసుకొంటే అది హృదయగతమౌతుంది. దుఃఖం తలంపు రూపంలో ఉంది. నీకు ఇష్టంలేని తలంపు వస్తే దుఃఖం వస్తుంది, అశాంతి వస్తుంది. నీకు ఇష్టాయిష్టాలు లేవు అనుకో ఏదీ నిన్ను బంధించదు సరికదా నీ మనస్సు యొక్క చాపల్యం తగ్గిపోతుంది. మనం ఏసి గదిలో పడుకొన్నాము, మంచం ఉంది, పరుపు ఉంది, దిండు ఉంది అన్నీ ఉన్నాయి. ఇవన్నీ బాగా నిద్రపట్టటానికే కదా. ఇన్ని ఉన్నా నీకు నిద్రపట్టలేదు అనుకో ఏసి గది ఎందుకు? మంచం ఎందుకు? పరుపు ఎందుకు? వీటి ప్రయోజనం ఏముంది? అలాగే నీకు ధనం ఉంది, చదువు ఉంది, గౌరవం ఉంది, మీకు అన్నీ ఉన్నాయి కాని అశాంతి పోవటం లేదు, ఈ ప్రకృతి గుణాలలోనుండి బయటకు రాలేకపోతున్నారు. ఇంక వాటివలన ప్రయోజనం ఏమిటి? జ్ఞానికి సంచితం, ఆగామి పోతాయి. ప్రారబ్ధం విడిచిపెట్టిన బాణంలాంటిది, ప్రారబ్ధం జ్ఞాని కూడా అనుభవించాలి అని చెపుతారు. ఇక్కడ భగవాన్ చెప్పేది ఏమిటి అంటే జ్ఞాని ప్రారబ్ధం కూడా అనుభవించనక్కరలేదు. ప్రారబ్ధం అహంకారం అనుభవిస్తుంది, ఆత్మ అనుభవించదు. అహంకారం లేనివాడికి ప్రారబ్ధం అనుభవించటం ఏమిటి? అక్కడ అనుభవించేవాడు అంటూ ఒకడు ఉంటే కదా అనుభవించటానికి. భగవాన్ చెప్పిన లాజిక్ అది. భగవాన్ ఉపదేశసారంలో 1 నుండి 15వ శ్లోకం వరకు సాంప్రదాయాన్ని క్రోఢీకరించారు. 15వ శ్లోకం నుండి తన హృదయాన్ని ఓపెన్ చేసారు, జ్ఞానమార్గాన్ని లోకానికి ఎత్తి చూపించారు. మొదటి శ్లోకం నుండి 15వ శ్లోకం వరకు కంకర రోడ్డు, 15వ శ్లోకం

నుండి 30వ శ్లోకం వరకు సిమెంట్‌రోడ్డు. అయితే కంకర రోడ్డు మీదే సిమెంట్‌రోడ్డు వేస్తారుగాని మట్టిరోడ్డు మీద సిమెంట్‌రోడ్డు వేయరు. ఆయన పెద్దలు చెప్పిన దానిని ఏమీ ఖండించలేదు. వారిని గౌరవిస్తూ, వారు చెప్పినది క్రోడీకరిస్తూ, తాను జ్ఞానమార్గాన్ని చెప్పాడు. మనం ఏదైనా చెపితే మీరు చెప్పేది తప్పు అని కొంతమంది అంటారు అది తెలివి తక్కువ వారి లక్షణం. మీరు చెప్పేది తప్పు అని కొంతమంది అనరు, మీరు ఏదో మీ అభిప్రాయం చెప్పారు, ఇలా చేసుకొంటే బాగుంటుందేమో ఆలోచించుకోండి అని అంటారు, అది తెలివైన వారి లక్షణం. నువ్వు మంచి చేస్తే బహుమతులు ఇవ్వటానికి, చెడ్డ చేస్తే మొట్టికాయలు మొట్టటానికి భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు. నువ్వు వ్యక్తిని అనుకొన్నంత కాలం దేముడు అనేవాడు ఒకడు ఉన్నాడు. నేను మంచి చేసాను, మంచి చేసాను అనుకొంటున్నావు కదా, అనుకొనేవాడు ఒకడు ఉన్నాడు కాబట్టి ఫలితం ఇచ్చేవాడు ఉన్నాడు. అయితే ఈ నేను ఎంత నిజమో, కర్మ ఫలితాలు ఎంత నిజమో అలా భగవంతుడు కూడా నిజమే. కాని నీ హృదయంలో ఉన్న నగ్నసత్యంలోనికి నీవు మేల్కొన్నప్పుడు జగత్తు, జీవుడు, ఈశ్వరుడు అన్నీ అణిగిపోతాయి, అది ఫైనల్.

భక్తులు కానివాళ్లను వదిలేయండి. భక్తులు కూడా మీ సొంత విషయాలను అడుగుతాను అనుకోండి, ఒక్కరు కూడా నిజం చెప్పరు. ఇవి అన్నీ విమర్శించటం కోసం చెప్పటం లేదు. నిజం చెప్పకపోయినా ఫరవాలేదు మీరు అందరు బుద్ధిమంతులు అనుకొంటున్నారు. మనకున్న స్థాయి ఏమిటో తెలుసుకోకుండా ఇతరులను విమర్శించటం. ఇదంతా చూసేవాడు, దీనికి శిక్ష ఇచ్చేవాడు ఒకడు ఉన్నాడు, అది మర్చిపోవద్దు. మనకు వివేకం ఉంటే మన గురించి మనకు ఒక అవగాహన ఉంటుంది. మనకు వివేకం లేదు, వైరాగ్యం లేదు. వివేకాన్ని, వైరాగ్యాన్ని అలవర్చుకోకుండా ఇతరులను విమర్శించటం, భవిష్యత్‌లో నీచజన్మలు రావటానికి ఇప్పటినుండి పునాదులు వేసుకోవటం. ఇది మన పరిస్థితి. మీరు ఎంతమందికి తీర్పులు చెప్పినా మీమీద తీర్పు చెప్పేవాడు ఒకడు ఉన్నాడు, అది మర్చిపోవద్దు. మనం ఎంతవరకు పవిత్రులం అవుతున్నాము, బుద్ధిసూక్ష్మతను ఎంతవరకు పెంచు కొంటున్నాము, ఎంతవరకు వివేకంగా జీవించగల్గుతున్నాము, ఎంతవరకు ప్యూరర్‌గా, వైజర్‌గా ఉండగలుగుతున్నాము అని ఏ రోజుకారోజు పరిశీలన చేసుకోవాలి. ఋషి చెప్పినది సత్య వాక్కు. ఆయనకు అబద్ధం చెప్పవలసిన పనిలేదు. ఈ ప్రపంచం నుండి ఆయన వాంఛించేది ఏమీ లేదు. ఈ గొప్పలు, గౌరవాలు అన్నీ ఆయనకు మిధ్యే. మనకు వచ్చే ఆలోచనలను, తలంపులను, మనం నోటితో మాట్లాడే మాటలను, చేతిలో చేసే పనులను అన్నింటిని సాక్షిగా చూసేవాడు ఒకడు ఉన్నాడు. మేము తెలివైనవారము అని మీరు అనుకోవచ్చు కాని

ఈశ్వరుడు మీకంటే తెలివిగలవాడు. మీకంటే శక్తిమంతుడు. మన ప్రేమ నిజమైతే, అది సహజమైన ప్రేమ అయితే ఆ ప్రేమకు పుణ్యం తెలియదు, పాపం తెలియదు. ఆ ప్రేమకు మరణానంతరజీవితానికి ఈ జీవితానికి బేధం తెలియదు. అట్టిది ప్రేమ అంటే, అది డివైన్ లవ్. ఆ ప్రేమ ఒక్క ఆత్మజ్ఞానంలో నుండే ఉదయిస్తుంది, అది దేహాభిమానంలో నుండి వచ్చేది కాదు. మనకు అసలు లోచూపు లేదు, లోచూపు సంపాదించుకోవాలి అనే బుద్ధి లేదు. మనం సజ్జనసాంగత్యం చేస్తూ ఉంటే లోచూపు సంపాదించుకోవాలనే బుద్ధి మనకు కలుగుతుంది. మనం కాలేజీలో చదువుకొనే చదువులకు ఆత్మజ్ఞానానికి ఎట్టి సంబంధం లేదు. అవి పొట్ట పోషణకు పనికివస్తాయి. లోపల ఉన్న వస్తువుకు ఆ చదువులకు ఆత్మజ్ఞానానికి ఎట్టి సంబంధం లేదు. రామకృష్ణ పరమహంస ఏమి చదువుకొన్నాడు అని ఆయనకు జ్ఞానం కలిగింది. ఆయన పరమపవిత్రుడు అందులో నుండి జ్ఞానం వచ్చింది. ఒకసారి శ్రీనాధుడు పోతనామాత్యుడితో ముసలిని చంపటానికి పరమాత్మ చక్రం లేకుండా వచ్చాడు అని వ్రాసావు, చక్రం లేకుండా ముసలిని ఎలా చంపుతాడు, నువ్వు అలా వ్రాసావు ఏమిటి? అని అడిగాడు. పోతనామాత్యుడు మౌనంగా ఉన్నాడు. తరువాత ఇద్దరు భోజనం చేస్తున్నారు. పోతనామాత్యుడు భోజనం దగ్గర నుండి ముందుగా లేచి చెయ్యి కడుక్కోవటానికి నూతి దగ్గరకు వెళ్లి చెయ్యి కడుక్కొంటూ బావా, బావా నీ మనవడు నూతిలో పడిపోయాడు అని కేక వేసాడు. శ్రీనాథుడు మజ్జిగ అన్నం పూర్తిగా తినకుండా నూతి దగ్గరకు పరుగెత్తుకొని వచ్చాడు. అప్పుడు పోతనామాత్యుడు ఏమన్నాడు అంటే తాడు తెచ్చుకోకుండా వచ్చావు ఏమిటి? నీ మనవడిని ఎలా రక్షిస్తావు? అని అడిగాడు. హ్యూమన్ లవ్ ఇంత వేగంగా వస్తే ఇంక డివైన్ లవ్ ఎలా ఉంటుంది అన్నాడు పోతనామాత్యుడు. అది భక్తులకే గోచరిస్తుంది కాని లౌకికులకు గోచరించదు.

సంసారం ఎందుకు ఇంత దుఃఖంగా ఉంటోంది అని అడుగుతున్నారు. రామకృష్ణ పరమహంసగారు ఏమి చెప్పారు అంటే నీటిలో పడవ ఉండవచ్చు కాని పడవలో నీరు ఉండకూడదు. అలాగే సంసారంలో మీరు ఉన్నా, మీ మనస్సులో సంసారం ఉండకూడదు. పడవలో నీరు ఉంటే పడవ మునిగిపోతుంది అలాగే మనస్సులో సంసారం ఉంటే మునిగిపోతారు. ఇదంతా నా వలననే అవుతోంది అని కర్తృత్వం పెట్టుకొంటే మునిగిపోతారు. కర్తృత్వమే మిమ్మల్ని బంధిస్తుంది, కర్తృత్వరహితుడికి దుఃఖం లేదు. ఆత్మను అన్వేషించే వాడికి ఆత్మానుభవం కలుగుతుంది. విషయాలను గ్రహించేవాడు చివరకు యముడికి దొరికిపోతాడు. సత్యాన్వేషణ వదిలేసి విషయాలనుగ్రహిస్తూ ఉంటే వాడి తిప్పలు ఎలా ఉంటాయో రామకృష్ణ పరమహంసగారు చెప్పారు. ఇద్దరు బాటసార్లు మామిడిచెట్టు కింద

కూర్చొన్నారు అందులో ఒకడికి చదువురాదు, రెండోవాడు బోటనీ చదువుకున్నాడు. చదువురానివాడు ఒక మామిడి పండు కోసుకొని తినేసి తొక్కలు అక్కడ పడేసాడు. రెండోవాడు ఈ చెట్టు ఎన్ని సంవత్సరాల నుండి ఉంది, దాని రొబ్బలు, ఆకుల గురించి బోటనీ అంతా చూస్తున్నాడు. మొదటివాడు మామిడిపండు తిన్నాక వెళ్ళిపోదాము రమ్మంటే నాకు ఇంకా లెక్కపెట్టటం అవ్వలేదు అన్నాడు, వాడు వెళ్ళిపోయాడు. ఈలోపు చెట్టు యజమాని వచ్చాడు. చెట్టు దగ్గర కూర్చొని లెక్కలు పెట్టేవాడిని నిన్ను కాయలు ఎవరు కొయ్యమన్నారు అని కొట్టాడు. దీని అర్థం ఏమిటి అంటే నీ హృదయంలో జ్ఞానం అనే పండు ఉంది. నీ శరీరానికి చావు రాకముందే జ్ఞానం అనే పండును లభ్యం చేసుకొని వెళ్ళిపోతే యముడు నిన్ను ఏమీ చెయ్యలేడు, సృష్టిని దాటి వెళ్ళిపోతావు. అలా చెయ్యకుండా ఆ బోటనీ స్టూడెంట్‌లా ఈ సృష్టి ఎంతకాలం నుండి ఉంది, ఇంకా ఎంతకాలం ఉండును, పరిణామంలో రోజులు ఎలా ఉండును అని అనుకొంటూ కాలం గడిపేస్తే చివరకు మరణం వస్తుంది, యముడికి దొరికేస్తావు, వాడు తీసుకొని వెళ్ళి అగ్నిలో పడవేస్తాడు, మల మల మాడిపోతావు. మనం ఈ లోకంలోనికి ఎందుకు వచ్చామో మర్చిపోయాము. మనం హాస్పటల్ పని మీద పాలకొల్లు వెళ్ళాము అనుకోండి, హాస్పటల్ పని చూసుకొని రావాలి అంతేగాని మెయిన్ రోడ్డు మీద ఉన్న కొట్లు అన్నీ లెక్కపెట్టుకొని రావటం ఏమిటి?

నీ శరీర యాత్రకు సరిపడ పని ఏదో చూసుకో, ఇతరుల మీద ఆధారపడవద్దు, పని కూడా అతిగా చెయ్యకూడదు. నీ పని ఏదో నీవు చేసుకొంటే మిగిలిన కాలం అంతా సత్యాన్వేషణకు ఉపయోగించు. నువ్వు అతిగా పనిచేస్తూ నేను టైర్ అయిపోయాను అని సత్యాన్వేషణ వదిలివేస్తే ఎలాగ? మన కుటుంబ వ్యవస్థ ఇతరులకు ఉపకారం చెయ్యనివ్వదు, సమాజానికి ఉపయోగపడేవారు కొద్దిమందే ఉంటారు. నీవు కోరికతో పనిచేస్తున్నావా, కోరిక లేకుండా పనిచేస్తున్నావా? నీవు కోరికతోనే పనిచేస్తున్నావు అనుకో కర్మ ఫలితాన్ని ఎవరికైనా పంచిపెడుతున్నావా? లేదు నీవే జుర్రుకొంటున్నావు. అంటే వచ్చిన ఫలితాన్ని అహంకారానికి నైవేద్యం పెడుతున్నావు. ఈమధ్య ఒక ముసలాయనతో మీరు చాలా కష్టపడుతున్నారు అని అంటే ఆయన కొడుకు ఏమన్నాడు అంటే ఆయనను ఎవరు కష్టపడమన్నారు? ఆయన ఆశను తృప్తిపరచుకోవటం కోసం కష్టపడుతున్నారు అంతేగాని ఎవరూ ఆయనను కష్టపడమని చెప్పలేదు. మీరు ఆయనను పొగుడుతున్నారు ఏమిటి? మాకు సరిపడ ఆస్తులు ఉన్నాయి, ఇంక ఆయన ఎవరికోసం కష్టపడుతున్నారు. పోనీ సమాజం కోసం ఏమైనా చేస్తున్నారా? అదీ లేదు. ఈశ్వరార్పితం ఏమైనా ఉందా అదీ లేదు. ఆయన అహంకారాన్ని సంతృప్తి పరచుకోవటంకోసం పనిచేస్తున్నారు అని చెప్పాడు.

అవసరంలేని విషయాలను మనం గ్రహించకూడదు. నువ్వు విషయాలను గ్రహించావా ప్రకృతి ప్రవాహంలో కొట్టుకొని పోతావు, అందులోనుండి విడుదల పొందలేవు. మీరు భగవాన్‌తో ఏ విషయం చెప్పినా ఆయన ఎప్పడూ ఆశ్చర్యం వ్యక్తపరచలేదు. అలా జరగవలసి ఉంది జరిగింది అంతే అనేవారు. నిన్ను ప్రేమించేవాడిని నువ్వు ప్రేమిస్తావు. నిన్ను ఎవడైతే ప్రేమించటం లేదో వాడిని నీవు ప్రేమించవు. ఇది మామూలుగా లౌకికులు చేసే పని. నువ్వు భక్తుడవు అయి ఉండి నీవు కూడా లౌకికుడిలా ప్రవర్తిస్తే నువ్వు భక్తుడవు ఎలా అవుతావు. నిన్ను ద్వేషించేవాడిని కూడా నీవు ప్రేమించలేకపోతే ఇంక నీవు భక్తుడవు ఏమిటి? విధి బలీయమైనది అని పురాణాలలో చెపుతారు, అది లౌకికంగా కరెక్టే. కాని దాని ప్రభావం ఆత్మజ్ఞానం మీద ఉండదు. భగవంతుడికి ఆఫీసుతో పని ఉంది, ఈ సృష్టిని నడిపే పని ఆయనకు ఉంది. జ్ఞానికి ఆఫీసు గొడవ లేదు. ఆయన మైండ్‌లెస్, వరల్డ్ లెస్, బాడీ లెస్, గాడ్ లెస్, అది జ్ఞాని యొక్క వైభవం. సత్య వస్తువుతో నీకు తాదాత్మ్యం వచ్చింది అనుకో విధి బలీయమైనదే అయినా దాని ఫోర్సు నిన్ను తాకదు, అది జ్ఞానం యొక్క వైభవం.

మనకు తెలిసినా, తెలియకపోయినా ఈ సృష్టి అంతా ఈశ్వరసంకల్పంతో నడుస్తోంది. ఇది నాలుగు వేదముల సారం. ఇదంతా ఈశ్వరసంకల్పంతోనే నడుస్తోంది అని నోటితో చెప్పటం కాదు, అది వాడి గుండెకు అర్థమవుతోంది అనుకో వెంటనే వాడిలో అశాంతి నశిస్తుంది. ఈమాట నీ రక్తంలో కలిసిపోవాలి, నీ ఎముకలకు పట్టాలి. ఈశ్వరసంకల్పానికి భిన్నంగా నువ్వు చేసేది ఏమీ లేదు. నీకు అమృతానుభవం కలిగింది అనుకో, అప్పడు ఈశ్వరసంకల్పం ప్రకారం ఎటువంటి సంఘటనలు జరిగినా అవి నిన్ను ముట్టుకోవు, నీకు అశాంతిని తీసుకొని రావు, ఆ స్థాయికి మనం ఎదగాలి. అప్పడు మనం ఈ సృష్టిని దాటి వెళ్ళిపోతాము. మీరు నైతిక విలువలు కలిగి ఉండండి అంటే ఈ నైతిక విలువలు, మీలో ఉన్న మంచితనం ఇవే గమ్యం కాదు, ఈ సృష్టిని ఓవర్‌కమ్ చేయటానికి అవి సహకరిస్తాయి కాబట్టి వాటిని అలవర్చుకోమని చెపుతున్నారు. ఉన్నదేదో ఉంది, అది నువ్వు అనుకొన్నట్లుగా లేదు, అది ఎలాగ ఉండాలో అలాగ ఉంది. ఆ స్థాయికి నువ్వు ఎదగాలి, అప్పడుగాని దాని అనుభవం నీకు రాదు. అప్పడు గాని నీవు ఈ సృష్టిని అతిక్రమించలేవు. బడిలో ఎందుకు చేరాము అంటే బడిలో ఉండిపోవటానికి కాదు, బడిలో చదువుకొని బయటకురావటానికి చేరతాము. అలాగే ఈ క్రియేషన్‌లోనికి ఎందుకు వచ్చాము అంటే ఈ సృష్టిలో ఉండిపోవటానికి కాదు, ఈ సృష్టిలో నుండి పాఠాలు నేర్చుకొని ఈ సృష్టిని ఓవర్‌కమ్ చేయటానికి వచ్చాము, అదే మన జీవితగమ్యం. బాగా ఎండాకాలంలో భగవాన్ చెప్పలు

లేకుండా వెళుతున్నారు. ఆ ప్రక్కన ఉన్న వాడిని రమ్మంటే నేను చెప్పలు లేకుండా రాలేను అన్నాడు. సూర్యుడిలో ఉన్న వేడి సూర్యుడిని ఏమి చేస్తుంది. సూర్యుడు ఎంత వేడిగా ఉన్నాడో అంత వేడిగా నువ్వు అయిపోతే అప్పడు సూర్యుడి వేడి నిన్ను ఏమి చేస్తుంది అన్నారు భగవాన్. నీవు ఈ సృష్టిని అతిక్రమించాలంటే భగవంతుడి పాదాలను ఆశ్రయించు. నిప్పు వేడిగా ఉంటుంది, ఆ వేడి నిప్పును ఏమీ చెయ్యదు. పాము నోటిలో విషం ఉంటుంది. ఆ విషం పామును ఏమీ చెయ్యదు. భగవంతుడిలో మాయ ఉంటుంది. ఆ మాయ భగవంతుడిని ఏమీ చెయ్యదు. భగవంతుడి పాదాలను ఆశ్రయించిన వాడికి మాయ దారి ఇస్తుంది, అప్పడు ఈ ప్రకృతిని ఓవర్‌కమ్ చేయటానికి సహాయ సహకారములు అందుతాయి.

పుణ్యపాపాలకు ఫలితం ఇచ్చేవాడు ఒకడు ఉన్నాడా, లేక ఇవి అన్నీ మన ఊహాగానాలేనా అని అడుగుతున్నాడు. ఉన్నాడు అని భగవాన్ చెప్పారు. ఉంటే ఎలాగ ఉంటాడు అని ప్రశ్న. నీకు ఒక దేహం ఉంది, మనస్సు ఉంది. నువ్వు లోపల ఉన్నాను అనుకొంటున్నావా, బయట ఉన్నాను అనుకొంటున్నావా. లోపలే ఉన్నాను అనుకొంటున్నావు, వాడు నీ లోపలే ఉన్నాడు. నీ లోపల ఉన్నాడు అని ఆయన నీ శరీరంలో ఒక భాగం కాదు. ఆయన నీ లోపల ఉన్నాడు, బయట ఉన్నాడు, ఈ సృష్టి అంతా వ్యాపించి ఉన్నాడు. నీ లోపల ఉన్నా ఆయన నీ మనో, దేహములకు అతీతంగా ఉన్నాడు. నీ లోపల ఉన్న వాడిని పట్టుకొంటే వాడే బయట ఉన్నాడు అన్న సంగతి నీకు తెలుస్తుంది. మంచితనం కూడా ఎంత కామన్‌గా ఉండాలంటే ఒక అబ్బాయికి మంచి ఉద్యోగం వచ్చింది, ఆ అబ్బాయి తండ్రి నా దగ్గరకు తీసుకొని వచ్చాడు. చదువుకొనేటప్పడు ఆ అబ్బాయికి క్లాసులో ఫస్టు వస్తే ఇంటి దగ్గర చెప్పేవాడు కాదు. తల్లితండ్రులకు తెలిసి నీకు ఫస్టుక్లాసు వచ్చిందట కదా అని అడిగితే అందులో విశేషం ఏముంది అంటాడట, అది ఔన్నత్యం. ఆ మనిషిలో తూకం ఉంది. తూకం ఉన్నవాడు సమానంగా ఉంటాడు. ఒక జ్ఞాని నోటివెంట వచ్చేమాట అది మాట కాదు, అది అనుగ్రహం, వాడి చూపు అనుగ్రహం, వాడి మౌనం అనుగ్రహం, ప్రతీదీ అనుగ్రహమే, అది గ్రహించినవాడు ధన్యుడు. రామకృష్ణ పరమహంసగారు స్పర్శ చేసేవారు, భగవాన్ చూపు అనుగ్రహం. పురాణాలు చదివినవాడు ఒకడు భగవాన్‌తో కృష్ణుడు అలా చేసాడు ఏమిటి? ఇలా చేసాడు ఏమిటి? అని తర్కించటం మొదలుపెట్టాడు. భగవాన్ ఏమన్నారు అంటే వాడు చేస్తాడు లేకపోతే చెయ్యడు, వాడు సర్వస్వతంత్రుడు, సర్వశక్తిమంతుడు, నువ్వు ఎవరు ప్రశ్నించటానికి అన్నారు భగవాన్. కృష్ణుడు తప్పు చేసాడు అని మన కళ్ళకు అనిపించినా, ఆయన దేవుడే. అది భగవాన్‌కు తెలుసు. భగవంతుడి యొక్క వైభవం

ఋషికి తెలియకుండా ఎలా ఉంటుంది. మనస్సు పల్చబడటం ప్రారంభించింది అనుకోండి ఈ జాగ్రదవస్థలో గాఢనిద్రాస్థితి వచ్చేస్తుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 05-02-2007, పాలమూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

సత్సంగాలు చాలా గ్రామాలలో నడుపుకొంటున్నారు. మీరు బాగుపడాలంటే సబ్జక్టు ప్రధానంగా ఉండాలి. మీ మాటలలో సబ్జక్టు ఉండాలి, మీ ఆలోచనలో సబ్జక్టు ఉండాలి. సబ్జక్టు తప్పించి ఇతర మాటలు అక్కడ రానివ్వకూడదు. సబ్జక్టు గురించి మాట్లాడుకోవటం అయిన వెంటనే ఎవరి ఇంటికి వారు వెళ్ళిపోవాలి. అలాగైతే మనం బాగుపడతాము. ఇతర మాటలు అక్కడ వస్తూ ఉంటే మన మనస్సు పల్చబడటానికి బదులు చిక్కబడుతూ ఉంటుంది. సబ్జక్టు ప్రధానంగా పెట్టుకొంటే మనకు తెలియకుండా ఆరోజుకారోజు మనస్సు పల్చబడుతుంది. గురువుల విషయంలో కూడా మీరు చాలా జాగ్రత్తగా ఉండండి. ఈమధ్య నెల్లూరునుండి ఒకరు ఫోన్ చేసారు. నేను రమణమార్గంలో ఉన్నాను, బాగానే ఉంది. ఈమధ్య మా అమ్మాయి అత్తవారింటికి వెళ్ళాను, అక్కడ ఒక గురువు దగ్గరకు వెళ్ళాను, ఆ చక్రం, ఈ చక్రం అంటున్నారు. ఇంక మరల ఆయన దగ్గరకు వెళ్ళలేదు. ఆ గురువుగారు మా అమ్మాయితో మీ అమ్మ రావటం మానేసింది, మీ అమ్మకు జబ్బులు ఎక్కువ వస్తాయి అని చెప్పాడట. గురువులు ఎలా ఉన్నారో చెప్పటం కోసం చెపుతున్నాను. మీరు అక్కడకు వెళ్ళకపోతే గురువుగారు ఏదో చేసేస్తారు అని అనుకోవటం, అది ఒక మూఢనమ్మకం. మీకు విచారణామార్గం అర్థమైతే, ఇవి అన్నీ దొంగనేను చేసే చేష్టలు. గురువుగారిలో ఉన్న దొంగ నేను జబ్బులు తెచ్చేస్తాను అంటుంది, ఈ దొంగనేను భయపడిపోతుంది. మీరు రమణ మార్గంలో ఉన్నారు, దేనికి భయపడవలసిన పనిలేదు. మీ శరీరానికి నిజంగా రోగం వస్తే వైద్యం చేయించుకోండి. అతను ఏదో అంటున్నాడని మీకు భయం కలుగుతోంది అంటే రమణమార్గం మీకు అర్థమవ్వలేదని చెప్పాను. చదివే పుస్తకాల విషయంలో, తినే తిండి విషయంలో, ఎన్నుకొనే గురువుల విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. సబ్జక్టు గురించి మాట్లాడుతూ ఉంటే, సబ్జక్టు గురించే ఆలోచిస్తూ ఉంటే మనకు ఉపయోగంలేని గొడవలలో నుండి విడుదల అయిపోతాయి. మీ పనులు మీరు శ్రద్ధగా చేసుకోండి. మీ పనుల కోసం ఇతరుల మీద ఆధారపడవద్దు. ఇతరుల విషయాలలో కలుగజేసుకోవద్దు. అక్కరలేని గొడవలలో కలుగజేసుకొనే కొద్దీ అజ్ఞానం పెరిగిపోతుంది. ఎవరైనా వచ్చి మీరు మంచివారు అంటే సంతోషిస్తాము, మీరు చెడ్డవారు అంటే దుఃఖపడతాము. ఈ రకమైన జీవితం

వదులుకోకపోతే మనస్సులోపలకు వెళ్ళదు. మన హృదయంలో ఈశ్వరుడు ఉన్నాడు. మన కళ్ళతో ఆయనను చూడలేము, మనస్సుతో అర్థం చేసుకోలేము కాని మనస్సును అక్కడకు పంపితే ఆయన వ్యక్తమవుతాడు. సబ్జక్టు ప్రోపర్‌గా అర్థమయ్యేకొలది మానసిక అనారోగ్యం తగ్గిపోతుంది. ఏకాగ్రత, పవిత్రత, భక్తి పెరుగుతాయి. గౌరవాలకోసం, గొప్పలకోసం పనులు చేయవద్దు. మీ అర్హతకు, యోగ్యతకు మించిన పనులు చేయవద్దు. సాధ్యమైనంతవరకు ఇతరుల గొడవలలో కలుగజేసుకోవద్దు, ఇతరుల గొడవలలో కలుగజేసుకొంటే దేహాభిమానం పెరుగుతుంది. అందుచేత నీపని ఏదో నీవు శ్రద్ధగా చేసుకో, ఇతరులు ఎవరైనా నిన్ను సలహా అడిగితే నీవు చెప్పవచ్చు అంతేగాని పిలవని పేరంటానికి మాత్రం వెళ్ళవద్దు. ఈవిధంగా దైనందినజీవితంలో విషయాలలో జాగ్రత్తగా ఉంటే, సబ్జక్టు అర్థం చేసుకొనే కొలది ఎక్కువ కష్టపడకుండా మీరు అభివృద్ధిలోనికి రావటానికి అవకాశం ఉంటుంది.

మనం ఏదైనా మాట్లాడుతూ ఉన్నా, పనిచేస్తూ ఉన్నా దేహాభిమానం పెట్టుకొని చేయకూడదు. ఇతరులను కాల్చటం వలన మనకు ఏమీ కలిసిరాదు, మన మనస్సును మనం కాల్చటం వలన మనలో అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడు మనకు వ్యక్తమవుతాడు. నాతోటి నేను శాంతిగా ఉండలేకపోతున్నాను, సమాజంతో శాంతిగా ఉండలేకపోతున్నాను, శాంతిస్థానం నాకు దొరకటం లేదు. శాంతిస్థానం నాకు దొరికేవరకు నాతోటి నేను అశాంతిగా ఉంటాను, సమాజంతో అశాంతిగా ఉంటాను, మాట మాట్లాడిన, చేతితో పని చేసినా అశాంతిగా చేస్తాను. ఈ అశాంతే దుఃఖంగా వ్యక్తమవుతుంది. ఏ కారణం వలన దుఃఖం వచ్చినా పునర్జన్మ వచ్చి తీరుతుంది. తెలివైనవారు అందరూ మేము తెలివైనవారము అనుకొంటున్నారు, వారు తెలివి దగ్గర ఆగిపోతున్నారు. మంచివారు అందరూ మంచితనం దగ్గర ఆగిపోతున్నారు, అందమైనవారు అందం దగ్గర ఆగిపోతున్నారు. ఈ ఆటంకాలు అన్నీ తీసి ప్రక్కనపెడితే హృదయంలో ఉన్న వస్తువు నీకు వ్యక్తమవుతుంది. ఈ గుణాలు, అలవాట్లు, దేహం, మనస్సు ఇవిఅన్నీ గాఢనిద్రలో మనలను వదిలేస్తున్నాయి. మనం ఏదైతే కాదో వాటిలో నుండి గాఢనిద్రలో మనం విడిపోతున్నాము. అలాగే జాగ్రదవస్థలో మనం కాని గొడవలలో నుండి విడిపోతే మనకు బ్రహ్మానుభవం కలుగుతుంది. ఈ జీవితానికి సంబంధించిన ప్రయాణం ఆగిపోతుంది. మన దేహం ఏదో రోజున చనిపోతుంది. ఈ దేహం చనిపోతే దేహయాత్ర ఆగిపోతుంది. కాని జీవితం ఆగదు. లోపలఉన్న జీవుడు ఇంకో దేహం తొడుక్కొంటాడు. వాడు నశించే వరకూ దేహాలు మారుతూ ఉంటాయి. ఈ పెంట అంతా మనస్సులో ఉంది. భూమిలో మీరు విత్తనం పాతిపెడతారు. ఆ విత్తనం చెట్టు కింద మారుతుంది. తరువాత విత్తనం కనిపిస్తుందా, కనిపించదు. తన్ను తాను నశింప చేసుకొని

చెట్టుకింద తయారవుతుంది. విత్తనం నశిస్తేనేగాని చెట్టు కింద మారదు, విత్తనం అలాగే ఉండాలి, చెట్టు రావాలి అంటే సాధ్యంకాదు. అలాగే మిమ్మల్ని మీరు పోగొట్టుకొంటే ఆత్మానుభవం కలుగుతుంది, ఆత్మసుఖం మీకు అందుతుంది. నేను విత్తనంగా ఉంటాను అంటే అది చెట్టు అవ్వదు. అలాగే మనం దేహాభిమానం విడిచిపెట్టలేము అనుకొంటే ఆత్మానందం మనకు దొరకదు. ఇవన్నీ చిట్కాలు మనం ప్రోపర్‌గా అర్థం చేసుకోవాలి. మనం నేను, నేను అనుకొనేది నిజమైననేను కాదు. అది దేహంతోటి, మనస్సుతోటి, గుణాలతోటి కలిసి ఉంటుంది. మనం ఏదైతే నేను నేను అనుకొంటున్నామో ఆ నేను పగిలి పోకుండా నీ హృదయంలో ఉన్న నిజం నీకు వ్యక్తం కాదు. ప్రతీ మనిషి ఎక్కడో ఒకచోట ఆగిపోతాడు. కొంతమంది డబ్బు సంపాదించి అక్కడ ఆగిపోతారు. కొంతమంది అధికారం సంపాదించి అక్కడ ఆగిపోతారు. ఇవి సత్యం కాదు, ఇవన్నీ మనం కల్పించుకొన్న గొడవలు, వీటితో ఉంటే మనం లోపలకు వెళ్ళలేము. మనం లోపలకు ప్రయాణం చేయకుండా, హృదయం యొక్క లోయలలోనికి చేరకుండా ఎవరికి జ్ఞానం రాదు. జ్ఞానం అనేది పైనుండి పోసేది కాదు, లోపలనుండి ఊరేది.

దేహప్రారబ్ధంలో ఏది ఉంటే అది వస్తుంది కాని లేనిది రాదు, ఉన్నది పోదు. మనం సాధన చేస్తూ ఉంటాము, ఫెయిల్ అవుతాము, కంగారు పడకూడదు. ఫెయిల్ అవుతున్నాము కాబట్టి లోపల వస్తువు లేదు అని అనుకోకూడదు. మన అలవాట్ల యొక్క వేగం వలన ఫెయిల్ అవుతున్నాము. అది అర్థం చేసుకొని నీవు పరమాత్మను చింతించటం వలన నెమ్మదిగా అలవాట్లు పల్చబడతాయి. నీ మనస్సులో వచ్చే హెచ్చుతగ్గులు, చిరాకులు, కోపం, గౌరవం, సంపాదించాలనే బుద్ధి ఇవి అన్నీ కూడా దేహము నేను అనే తలంపులో నుండి వస్తున్నాయి. దేహము నేను అనే తలంపును తగ్గించుకొంటూ వస్తే, అది దాని పుట్టుస్థానమైన హృదయంలో లయమైపోతే అక్కడ ఉన్న పరమేశ్వరుడు తనంతట తానుగా మీకు వ్యక్తమవుతాడు. విచారణమార్గం కష్టం ఏమీ కాదు, మనకు భక్తి లేక, శ్రద్ధ లేక కష్టం అనిపిస్తుంది. ఏదైనా ఒక సబ్జక్టులో అభివృద్ధిలోనికి రావాలనుకొనే వారు చదవటం తోటి, వినటం తోటి సరిపెట్టుకోరు. ఆ సబ్జక్టు తెలిసినవారితో పరిచయం పెంచుకొంటారు, వారు సబ్జక్టులో ఆ స్థాయికి ఎలా వచ్చారు, మనం ఎందుకు రాలేకపోతున్నాము, ఆటంకాలు ఏమిటి అని చూసుకొని ఆటంకాలను తొలగించుకోవటానికి ప్రయత్నం చేస్తారు. సబ్జక్టును ప్రధానంగా పెట్టుకొని జీవిస్తూ గమ్యాన్ని చేరుకొంటారు. అందుచేత మనం మాట్లాడుకొనేటప్పుడు సబ్జక్టు మాట్లాడుకోవాలి, సబ్జక్టు గురించి ఆలోచించాలి. సబ్జక్టు విడిచిపెట్టి లోకం గొడవలు

చెప్పకొంటూ ఉంటే అక్కడ నుండి వెళ్ళిపోవాలి. లోకం గొడవలు చెప్పకొంటూ ఉంటే లోకవాసన పెరిగిపోతుంది. నీవు సుఖం కోసం బయట వెతుకుచున్నావు. బయట ఎక్కడా సుఖం లేదు. సుఖం నీ స్వరూపంలోనే ఉంది. సుఖం ఎక్కడైతే ఉందో అక్కడ వెతికితే సుఖం దొరుకుతుంది. సుఖంలేనిచోట సుఖం కోసం నీవు కోటిజన్మలు వెతికినా సుఖం నీకు దొరకదు. అవసరం అయితే కోటి రూపాయలు పెట్టి ఒక వస్తువును కొనుక్కోవచ్చుగాని జీవితంలో జరిగిపోయిన కాలాన్ని కోట్ల రూపాయలు పెట్టినా కొనుక్కోలేరు. అందుచేత ప్రతీక్షణం జాగ్రత్తగా ఉండండి. నీకు మంచి తలంపులు రావచ్చు, చెడు తలంపులు రావచ్చు. ఏ తలంపు వచ్చినా దేహము నేను అనే తలంపులో నుండే వస్తున్నాయి. మీరు మంచి పని చేసేటప్పడు కూడా అది అవసరం ఉండి చేస్తున్నామా లేక గౌరవం వస్తుంది అని చేస్తున్నామా అని చూసుకోవాలి. అవసరం ఉండి చేస్తూ ఉంటే దేహము నేను అనే తలంపు పల్చబడుతుంది, గౌరవం ఆశించిచేస్తే దేహబుద్ధి పెరిగిపోతుంది. నేను ఇది సాధించాను, అది సాధించాను అని దేహబుద్ధిని పెంచుకొంటూ ఉంటే నీవు సాధించినపని ఏమీ నీకూడా రాదు, నీపాడుబుద్ధి నీకూడా వస్తుంది, అది అనేక నీచజన్మలకు కారణమవుతుంది. కొంతమంది ప్రతీమాట లౌక్యంగా మాట్లాడతారు, ఏదో తెలివితేటలుగా మాట్లాడాము అనుకొంటారు. వారితో స్నేహం వలన తొందరగా పాడైపోతాము. లౌకికులతో స్నేహం చాలా ప్రమాదం. వారికి లోకం ప్రమాణంగాని శాస్త్రం ప్రమాణం కాదు. మనం పది రూపాయలు సంపాదించి, 20 రూపాయలు ఖర్చుపెడితే నిల్వలో ఉంటామా, అప్పలో ఉంటామా? అప్పలో ఉంటాము. అలాగే మనం ఒక గంట సాధన చేసి రెండు గంటలు లౌకికులతో సహవాసం చేస్తూ ఉంటే మనం చేసిన సాధన పోతుంది, మన బుద్ధి పాడైపోతుంది, చివరకు చీకటిలోకాలు మిగులుతాయి.

అహంకారం తాచుపాములాంటిది, దానిని నమ్మటానికి వీలులేదు, అది ఎప్పడు కరుస్తుందో చెప్పలేము. కొంతమంది పరిస్థితులు అనుకూలంగా లేకపోతే అణిగి ఉంటారు, అది వినయం కాదు, అది నిజం కాదు. అహంకారం ఏ క్షణంలో అయినా విజృంభించవచ్చు. అహంకారం శరీరంతోటి, ఇంద్రియాలతోటి, లోకవిషయాలతోటి జత కడుతుంది. శరీరంతో జత కట్టటం వలన నీవు నల్లగా ఉన్నావు అంటే దుఃఖం వస్తుంది, నీవు ఎర్రగా ఉన్నావు అందంగా ఉన్నావు అంటే పొంగు వస్తుంది. ఏదైతే మనం నేను నేను అంటున్నామో దానికి జతలు మాన్పించేస్తే, జతలు ఏమీ లేకపోతే సహజంగా దాని గూటిలో అది పడిపోతుంది. రామకృష్ణపరమహంస, రమణమహర్షి వీరు ఇద్దరు మనకోసం మతాన్ని తేలికపరిచారు,

ఎలా చెపితే మనకు తేలికగా అర్థమౌతుందో అలా చెప్పి మార్గాన్ని సుగమం చేసారు. ఒక సంవత్సరం సాధన చేసి నేర్చుకోవలసిన విషయం మీరు అర్థం చేసుకొంటే ఒక్క నిమిషంలో తెలుస్తుంది, పైగా ఇది ప్రమాదంలో పడనివ్వదు. ఇది వరకు రోడ్డు లేదు అని నేను అనటం లేదు. కంకరరోడ్డు ఉంది అనుకోండి, వీరు ఇద్దరూ సిమ్మెంట్‌రోడ్డు వేసారు. కంకరరోడ్డు మీద ప్రయాణం చాలా టైర్ అవుతాము, మెరకపల్లాలు ఉంటాయి. సిమ్మెంట్‌రోడ్డు మీద ప్రయాణం తేలిక, అసలు టైర్ అవ్వము. వీరు ఇద్దరు సబ్జక్టును మనకు అందుబాటులోనికి తెచ్చారు, తేలికగా అర్థమయ్యేటట్లు చెప్పారు. ఉపనిషత్‌లలో ఇది అసత్యం, ఇది అసత్యం అని చెపుతూ సత్యం దగ్గరకు తీసుకొని వెళ్ళారు భగవాన్ అసత్యాన్ని వదిలేసి స్పెసిఫిక్‌గా సత్యం గురించి చెపుతూ అక్కడికి తీసుకొనిపోవటానికి చూసారు. మీరు సాధన, సాధన అంటూ చాలా కష్టపడుతున్నారు. సాధన చేసి బాగుపడుతున్నారా అంటే అదీ లేదు, చివరకు చెమట మిగులుతోంది. ఈ దొంగనేనుకు జతలు మాన్పించేస్తే దానంతట అదే పల్చబడిపోతుంది. జతలు మాన్పిస్తే అది ఊపిరి ఆడక చనిపోతుంది. జతలు కలుపుతూ ఉంటే అది ఊపిరి పోసుకుంటుంది, ఊపిరి పోసుకొని అది ఊరుకొంటుందా మనకు తలపోటు తీసుకొని వస్తుంది. మనం ఏ స్థాయికి రావాలంటే మనం సబ్జక్టు చెపుతూ ఉంటే అక్కడ వ్యక్తి కనబడకూడదు, సబ్జక్టు కనిపిస్తూ ఉండాలి.

ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే, ద్వితీయం లేదు. మీరు గుర్తింపులు ఆశించవద్దు. మిమ్మల్ని మీరు మర్చిపోయి పనిచెయ్యండి. అప్పుడు ఆధ్యాత్మికంగా ఎంత అభివృద్ధిలోనికి వస్తారో చూసుకోండి, గంటల తరబడి ధ్యానం చేసేవారి కంటే మీరు ముందు అభివృద్ధిలోనికి వస్తారు. మేము చెప్పే ప్రతీమాట నమ్మమని అనటం లేదు, మీరు కూడా ఆలోచించుకోండి. మీకు నచ్చితే మీకు పనికి వస్తే తీసుకోండి లేకపోతే ఊసేయండి. మనం నిర్మలంగా, నిశ్చలంగా, ఆడంబరం లేకుండా ఉండటం నేర్చుకొంటే హృదయంలో ఉన్న భగవంతుడు స్వరూపంగా వ్యక్తమవుతాడు. నీకు అర్హత, యోగ్యత వచ్చింది అనుకో గురువును విడిచిపెట్టి నువ్వు ఉండలేకపోవటం కాదు, నిన్ను విడిచిపెట్టి గురువు ఉండలేడు. పరిస్థితులు మనకు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా మనస్సు నిర్మలంగా, నిశ్చలంగా ఉండేటట్లు చూసుకోవాలి. ఇంట్లో వారు మమ్మల్ని అగౌరవంగా చూస్తున్నారు అని కొంతమంది చెపుతూ ఉంటారు. మీరు బాగుపడటానికి భగవంతుడు అలా చేస్తున్నాడు. వారు మమ్మల్ని గౌరవంగా చూస్తే మీకు మమకారం పెరిగిపోతుంది. వారిమీద మమకారం తగ్గటానికే గురువు అలా అనిపిస్తున్నాడు. మమకారం తగ్గకపోతే మీ మనస్సు లోపలకు వెళ్ళదు. మీకు డబ్బు ఇచ్చినా

భగవంతుడే, డబ్బు ఇవ్వకుండా ఆపుచేసినా భగవంతుడే, అప్పుడు పాఠాలు నేర్చుకోవాలి. మీకు ఒకోసారి వంద రూపాయలు కావాలనుకొంటే వెయ్యి రూపాయలు ఇస్తాడు ఎందుకు ఇచ్చాడో మీకు తెలియదు. అప్పుడు మీలో ఏమైనా పొగరుబోతుతనం పెరుగుతోందా అని చూసుకొంటాడు. మీకు అన్ని అవకాశములు ఉన్నా, చేతినిండా డబ్బు ఉన్నా, మనం భోగించే వస్తువులు ఎదురుగా ఉన్నా భోగవాంఛ లేకుండా ఉంటే అది తపోయజ్ఞము. మనలను నక్కలుగా ఉండవద్దు అంటున్నారు భగవాన్. నక్కకు ద్రాక్ష పండ్లు అందలేదు అనుకోండి, అందటంలేదు అనదు, పుల్లగా ఉన్నాయి అంటుంది, అందితే తినేస్తుంది. మీకు భోగాలు అందని మూలంగా విరక్తి వస్తే అది నిజంకాదు, భోగాలు ఎదురుగా ఉండాలి, మనస్సు వాటి మీద వాలకూడదు. అది నిజం. మనం సాధకులుగా ఉండాలి గాని నక్కలుగా ఉండకూడదు. పైకి నిగ్రహంగా కనిపిస్తూ లోపల విషయచింతన పెంచుకొంటూ ఉంటే వారిని మిధ్యాచారి అన్నారు. మిధ్యాచారిగా ఉంటే హృదయంలో ఉన్న నిజానికి దూరం అవుతాడు.

మీ కుటుంబ పరిస్థితులు, సమాజ పరిస్థితులు అనుకూలంగా లేవు అనుకో, మీరు ఎంత మంచితనంగా ఉన్నా మీ కోడలు ఏదో ఒకటి అంటోంది అనుకో అప్పుడు కూడా నీవు శాంతిగా ఉండ గలిగితే మనస్సు నిర్మలమవుతుంది, నిశ్చలమవుతుంది, మనస్సుకు లోచూపు కలుగుతుంది. నేను సుఖంగా లేను అని ఒకరు భగవాన్‌తో అంటే ఏ నేను సుఖంగా లేదు అన్నారు. ఆ నేను కలుషితం అయిపోయింది. పెంటమీద కూర్చొని పెంటవాసన వస్తోంది అంటే పెంట యొక్క పొరపాటుకాదు, పెంటమీద కూర్చొన్న నీది పొరపాటు. నీవు ఏదైతే నేను, నేను అంటున్నావో ఆ నేనులో దోషం ఉంది. దోషంలో నుండి సుఖం లేదు, శాంతి లేదు. రామకృష్ణుడిలో గొప్పతనం ఏమిటి అంటే ఆయనలో కపటం లేదు, అటువంటి వారిలో నుండి వచ్చేమాట పవిత్రంగా ఉంటుంది. జ్ఞానం అంటే ఏమిటి అని అడిగితే నీవు ఏదైతే నేను, నేను అంటున్నావో ఆ నేను నేను కాదని తెలుసుకోవటమే జ్ఞానం అని చెప్పారు. ముందు ఈ వాక్యాన్ని ఎంజాయ్ చేయండి. ఎంత సింపుల్‌గా చెప్పారో చూడండి. ఆ నేనే బంధం, ఆ నేను నుండి విడుదల పొందటమే మోక్షం. ఆ నేను ఎలాగ వచ్చిందో మనకు తెలియటం లేదు. ఆ నేను ఎక్కడ నుండి అయితే పుట్టి వచ్చిందో అక్కడకు పంపిస్తే సరిపోతుంది. ఆ పంపటం చేతకాక మనం కొట్టుకొంటున్నాము. ఈ సృష్టిలో ఎక్కడా సుఖం లేదు, శాంతి లేదు. లేనిచోట ఎంత వెతికినా అది దొరకదు. నీ స్వరూపంలోనే సుఖం ఉంది, శాంతి ఉంది. నీ స్వరూపంలో వెతికితే నీవు సుఖి అవుతావు, అప్పుడు దుఃఖం నశిస్తుంది, ఇంక పునర్జన్మ ఉండదు. ప్రారబ్ధాన్ని ఎంజాయ్ చెయ్యి అని ఆచార్యులవారు

చెప్పారు. మీ కోడలు మిమ్మల్ని తిడుతోంది అనుకోండి తిరిగి మీరు తిట్టటం మానేసి మీ పూర్వజన్మ పాపం కోడలు రూపంలో వచ్చింది అనుకోండి. నీవు ఎంజాయ్ చేయటం వలన ప్రారబ్ధం పోతుంది అని చెప్పారు. ఇష్టాయిష్టాలు తగ్గిపోతే మనస్సు యొక్క చాపల్యం తగ్గిపోతుంది, చాపల్యం తగ్గేకొలది మీ సాధన తేలిక అవుతుంది. ఎవరిని చూసి మీరు ఇష్టపడుతున్నారో ఒకోసారి వారే అపకారం చెయ్యవచ్చు, ఎవరిని చూసి మీరు అయిష్టపడుతున్నారో ఒకోసారి వారే మీకు ఉపకారం చెయ్యవచ్చు, అది మనం చెప్పలేము. ఈ ఉపకారాలు, అపకారాలు గొడవ వదిలెయ్యండి. ఇంట్లో వారి ప్రేమలు కూడా కలుషితమైన ప్రేమలు. మీ కుటుంబ సభ్యులకు మీరు ఎక్కువ డబ్బు, ఆస్తి ఇచ్చినా ఒకోసారి వారు సంతోషించరు సరికదా ఇవ్వక ఏమి చేస్తాడు అంటారు. ఇదంతా దొంగ నేను యొక్క చేష్టలు. నీవు దాని వెంట పరుగుపెట్టవద్దు. నీవు ఏదైతే అవునో దాని గురించి శ్రవణం చెయ్యి, దానిని స్మరించు, దానిని మననం చెయ్యి, దానిని తెలుసుకోవటానికి ప్రయత్నం చెయ్యి. మీరు సబ్జక్టు గురించి మాట్లాడండి. సబ్జక్టు గురించి తప్ప ఇతర గొడవలు ఎవరైనా చెపుతూ ఉంటే బుడబుక్కల మాటలు మాట్లాడవద్దు అని చెప్పండి. ఏమీ మొఖమాటపడవద్దు. మీకు సబ్జక్టు ప్రధానం, ఆలోచన ప్రధానం. భక్తులైన మీకు అందరకు నా ప్రార్థన ఏమిటి అంటే సబ్జక్టు ప్రధానంగా, ఆలోచనే ప్రధానంగా జీవించండి. సబ్జక్టు గురించి తప్ప ఇతర మాటలు చెపుతూ ఉంటే మీరు వినవద్దు, పామును చూసి ఎలా పారిపోతారో అలాగ అక్కడ నుండి పారిపోండి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 16-02-2007, చించినాడ

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు శివరాత్రి. భగవంతుని అవతారములలో ముఖ్యమైనవి శివుడు, కృష్ణుడు. శివకేశవులకు బేధం చూడకూడదు. ఇప్పుడు ఎవరైనా కృష్ణుడి విగ్రహం తెచ్చి ప్రక్కన పెట్టారు అనుకోండి, ఏమిటి కృష్ణుడిని తీసుకొని వచ్చి పెట్టారు అనుకోకూడదు, ఆ కృష్ణుడిలో కూడా శివుడినే చూడాలి. శివకేశవులకు బేధం లేదు. మన బుద్ధిలో ఉన్న దోషాలు పోతేగాని మనకు జ్ఞానం కలుగదు. అవి ఎప్పడో వేలాది జన్మల నుండి మనకూడా వస్తున్నాయి. శివనామం ఏమి చేస్తుంది అంటే మన బుద్ధిని కాలుస్తుంది అంటే మన బుద్ధిలో ఉన్న దోషాలను తొలగిస్తుంది. మన బుద్ధిలో ఉన్న దోషాలను తొలగించిన తరువాత మనకు జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు. అది శివనామం యొక్క ప్రత్యేకత. శివుడు అంటే ఎవరోకాదు మన హృదయంలో ఉన్న ఆత్మే శివుడు అంటే నిజమైన నేనే శివుడు. ఈరోజు పగలు ఉపవాసం

ఉండి, రాత్రి జాగరణం అంటే శివనామం స్మరించుకోవటం, శివుడి రూపాన్ని ధ్యానించుకోవటం, అది సాంప్రదాయం. ఉపవాసం వలన శరీరానికి ఆరోగ్యం, స్మరణ వలన మనస్సుకి ఆరోగ్యం వస్తుంది. మీలో కొంతమంది సాధన పేరు మీద చాలాకష్టపడుతున్నారు కాని బూడిదలో పోసిన పన్నీరు కింద అయిపోతోంది. మన పద్ధతి ఎలా ఉంది అంటే ఒక కాసు బంగారం హోటలుకు తీసుకొని వెళ్ళి ఇది మీరు పుచ్చుకొని మాకు ఒక కప్పు కాఫీ ఇమ్మనటం ఎలా ఉంటుందో, మనం సాధన చేసి భక్తిని సంపాదించి లోకం గొడవలలో ఉంటూ మాకు అది కావాలి ఇది కావాలి అని అడుగుతూ మీ శక్తిని వృధా చేసుకోవటం అలాగే ఉంటుంది. భగవంతుడు మనకు ఏది మంచిదో అది ఇస్తాడు. ఏదీ కోరి తెచ్చుకో కూడదు. మీరు ఏదీ భగవంతుడిని అడగవద్దు. అడిగితే మన భక్తి అక్కడికి పరిమితమై పోతుంది.

శరీరం పుట్టినది మొదలు, చనిపోయేవరకు ఎవడి జీవితం సమానంగా ఉండదు. ప్రారబ్ధం ప్రకారం శరీరయాత్ర జరిగిపోతూ ఉంటుంది. మనం దేహభావనతో పనులు చేస్తూ కర్తృత్వం పెంచుకోవటం, జన్మలు పెంచుకోవటం ఇదంతా మనకు ఆత్మజ్ఞానం లేకపోవటం వలన వస్తోంది. అహంకారం, మమకారం లేకుండా దేహాభిమానం రాదు. దేహాభిమానం నశించకుండా మీరు కోటి జన్మలు ఎత్తినా మీకు ఆత్మజ్ఞానం కలుగదు. మీలో కొంతమంది చాలా తెలివైనవారు ఉండవచ్చు. తెలివితేటలు, పాండిత్యం, మంచితనం ఇవన్నీ మంచివే. అంతమాత్రంచేత ఆత్మజ్ఞానం కలుగదు. ఈశ్వరానుగ్రహం లేకుండా, గురువు యొక్క దయ లేకుండా ఎవరికి ఆత్మజ్ఞానం కలుగదు. మేము తెలివైనవారము, మేము మంచివారము అని అనుకొంటూ మీ నెత్తిమీద మీరే అక్షింతలు వేసుకొని పొంగిపోవటం. ఒకవేళ మీరు నిజంగా మంచివారు అయినా గురువు యొక్క దయలేకుండా మీకు ఆత్మజ్ఞానం కలుగదు. స్వరూపంలో ఈశ్వరుడు, జీవుడు ఒక్కటే. అజ్ఞానం వలన, దేహాభిమానం వలన శివుడు వేరు, జీవుడు వేరు అనే భావన కలుగుతోంది. మీరు ఏ మతస్థులైనా, ఏ కులస్థులైనా, మీ గురువు ఎవరైనా దేహాభిమానం నశించకుండా జ్ఞానం కలుగదు. మనం అందరం ఈ భూమి మీదకు వచ్చాము. ఈ శరీరం భూమి మీద ఎంతకాలం ఉండాలో అంతకాలం ఈ బొమ్మను ఆడిస్తాడు, తరువాత తీసుకొని పోతాడు. అయితే ఈలోపు కష్టాలు వస్తాయి, సుఖాలు వస్తాయి, లాభం వస్తుంది, నష్టం వస్తుంది, సంతోషం వస్తుంది, దుఃఖం వస్తుంది, ఇవి అన్నీ అబద్ధమే. వీటితో తాదాత్మ్యం పొందవద్దు. మన శరీరం పుట్టినది మొదలు, చనిపోయేవరకు మనం చేసేపనులను, మనకు వచ్చే తలంపులను అన్నింటిని రికార్డు చేయటానికి ఒకడిని భగవంతుడు నియమించాడు. వాడే

చిత్రగుప్తుడు. ఇప్పుడు మనం చించినాడ వచ్చాము. ఎంతమంది శ్రద్ధగా వచ్చారు, ఎంతమందిలో జిజ్ఞాస ఉంది, ఎంతమంది కాలక్షేపం కోసం వచ్చారు, ఏదో పుణ్యం వస్తుంది కదా అని ఎంతమంది వచ్చారు ఇదంతా ఆయన రికార్డు చేస్తాడు. మనందరికి పెర్సనల్ ఫైల్స్ అక్కడ ఉంటాయి, ప్రతీదీ అందులో రికార్డు చేసి శరీరం మరణించిన తరువాత ఈ జీవుడు యమధర్మరాజు దగ్గరకు వెళ్ళినప్పుడు ఆ రికార్డు అక్కడ పెడతాడు. అప్పటివరకు ఆయన ఏమీ మాట్లాడడు. మనం చేసే మంచిని, చెడ్డను ప్రతీ దానిని రికార్డు చేస్తాడు. మనం ఆయనను ఇన్‌ఫ్లుయన్స్ చేయటం కుదరదు ఎందుచేతనంటే ఆయన మన కళ్ళకు కనబడడు.

సరస్వతీదేవిని ప్రార్థిస్తే బాగా చదువు వస్తుందని, లక్ష్మీదేవిని ప్రార్థిస్తే డబ్బు ఇస్తుందని, లేకపోతే దేవతలను ప్రార్థించటం వలన మనకు భోగాలు ఇస్తారు, మన కోరికలు తీరుస్తారు అని చెపుతూ ఉంటారు. కాని సుఖం అనేది ఈ సృష్టిలో జీవకోటిలోగాని, పంచ భూతాల్లోగాని, దేవతలలోగాని ఎక్కడా సుఖంలేదు. ముఖ్యంగా అది మనకు అర్థమవ్వటం లేదు. సుఖానికి మరొక పేరే ఆత్మ, సుఖానికి మరొకపేరే చైతన్యం. ఆత్మలో తప్పించి సుఖం బయట ఎక్కడా లేదు. అందుచేత ఎవడైతే ఆత్మజ్ఞానాన్ని పొందటానికి ప్రయత్నం చేస్తున్నాడో వాడే సుఖి అవుతాడు మిగతావాడికి ఎవ్వడికీ సుఖం అందదు. మనం ఆత్మజ్ఞానం గురించి శ్రవణం చేయగా చేయగా ఆత్మజ్ఞానం సంపాదించాలనే బుద్ధి మనకు కలుగుతుంది. కాని మనం దాని గురించి శ్రవణం చేయటంలేదు. పూర్వపుణ్యం లేకపోతే శ్రవణం చేయాలనే బుద్ధి కూడా మనకు కలుగదు. జిజ్ఞాస లేకుండా జ్ఞానం కలుగదు, జ్ఞానం లేకుండా ఎవడూ సుఖి అవ్వలేడు. జ్ఞానంలో తప్పించి సుఖం ఎక్కడా లేదు అని మనకు తెలియక దేవతలను ఏవో భోగాలు కావాలి అని అడిగేస్తాము, అడిగితే వారు ఇస్తారు. ఈ భోగాలు అన్నీ వచ్చే జన్మలో రోగాలుగా మారిపోతాయి, అది మనకు తెలియటం లేదు. ఒకోసారి భగవంతుడు మనకు అన్నీ ఇచ్చేస్తాడు. అన్నీ ఇచ్చినా మీరు వికారం లేకుండా ఉన్నారా అని చూసుకొంటాడు అన్నీ ఉన్నా మీరు వికారం లేకుండా ఉండగలిగితే ఆయన స్వరూపాన్ని మీకు ఇస్తాడు. మనం గొప్పలకోసం పనులు చేయకూడదు. మనకు దేశభక్తి లేదు, దైవభక్తి లేదు. టాగూర్ ఒక పద్యంలో ఏమని వ్రాసాడు అంటే సూర్యుడు రోజూ ఉదయిస్తున్నాడు, అస్తమిస్తున్నాడు. అస్తమించేటప్పుడు సూర్యుడు అనుకొన్నాడట రేపు ఉదయం వరకు మనం రాము వెళ్ళిపోతున్నాము అయ్యో రేపు ఉదయం వరకు ఈ జీవకోటి అంతా చీకటిలో ఉండాలి, రేపు ఉదయం వరకు నా పని చేసిపెట్టేవారు ఎవరైనా ఉన్నారా అని సూర్యుడు అడిగాడట.

అప్పుడు ఒక కిరసనాయిలు దీపం ముందుకు వచ్చిందట. ఓ సూర్యభగవానుడా! నేను నీ అంతటి పెద్దవాడిని కాదు, నువ్వు ఎన్నో కోట్ల జీవరాశులకు వెలుతురు ఇస్తున్నావు కాని నేను ఇంతమందికి వెలుతురు ఇవ్వలేను. అలాగని అసలు వెలుతురు ఇవ్వకుండా ఉండను. నువ్వు కోట్ల మందికి వెలుతురు ఇస్తే పోనీ నేను నలుగురికైనా వెలుతురు ఇస్తాను, నువ్వు రేపు ఉదయం వచ్చేవరకు నేను ఉంటాను అని చెప్పిందట. ఇక్కడ మనం అర్థం చేసుకోవలసింది ఏమిటి అంటే కిరసనాయిలు దీపం తన పాత్ర ఏదో తాను పోషించింది. మనం కృష్ణుడిలాగో, శివుడిలాగో పనిచేయలేకపోవచ్చు కాని కిరసనాయిలు దీపం లాగ మన పాత్ర మనం నిర్వర్తించాలి. మనం చేయగలిగిన పని మనం చేయాలి అది ఇక్కడ కిరసనాయిలు దీపం చెప్పేది. ఈ భూమి మీదకు వచ్చినందుకు మన పాత్ర ఏదో మనం నిర్వర్తిస్తూ, మనం చేసే పనులు చిన్న పనులు అయినా ఈశ్వరార్పణంగా చేస్తే ఆయన అనుగ్రహానికి పాత్రులవుతాము.

మనం కాలేజీలకు వెళుతున్నాము, గుడికి వెళుతున్నాము ఎందుకు వెళుతున్నాము, నేర్చుకోవటానికి వెళుతున్నాము. అంటే అక్కడ నుండి బయటకు వచ్చేటప్పుడు ఎంతోకొంత తెలివితేటలు పెంచుకొని బయటకురావాలి. ఇప్పుడు మీరు ఈ మీటింగులకు వస్తున్నారు అంటే ఎంతో కొంత మీరు బాగుపడాలి, వివేకం పెరగాలి, విచక్షణ పెరగాలి, మీ పనులు శ్రద్ధగా చేసుకోవాలి, ఇతరులు ఎవరైనా మిమ్మల్ని మోసం చేయటానికి ప్రయత్నం చేస్తే ఆ మోసంలో పడకూడదు, మీకాళ్ళ మీద మీరు నిలబడాలి అంతేగాని తెలివి తేటలు తగ్గించుకోవటానికి ఈ మీటింగులకు రావటం ఎందుకు? మిమ్మల్ని ఎవరినీ కట్రాడుకు కట్టేయటానికి ఇక్కడకు పిలవటంలేదు. ఈ మీటింగుల వలన మీరు ఎంతో కొంత బాగుపడాలి, మీ కుటుంబపోషణ చూసుకొంటూ ఎంతో కొంత సమాజానికి ఉపయోగపడే శక్తి మీకు రావాలి. సృష్టివేరు, దేవుడువేరు కాదు. దేవుడే సృష్టిరూపం ధరించాడు. మీరు ఎదుటిమనిషికి సలహా చెప్పేటప్పుడు, మీరు ఏ మనిషికైతే సలహా చెపుతున్నారో, ఆ మనిషి ఏ కష్టంలో ఉన్నాడో అదే కష్టంలో మీరు ఉన్నప్పుడు మీరు ఎలా ప్రవర్తిస్తారో ఆలోచించి అలాగ సలహా చెప్పాలి. మనం ఎక్కడికి వెళ్ళి చూసినా ఈ సృష్టిలో రెండే మనలను బంధించేవి 1. రూపబుద్ధి, 2. నామబుద్ధి. ఈ రెండింటిని మనం తేలికగా తీసుకొంటున్నాము, ప్రతీవాడు అనుకొంటాడు వాడి పేరు లోకం అంతా వ్యాపించి పోవాలి అని వాడికి జ్ఞానం అక్కరలేదు, ప్రజల సుఖం అసలే అక్కరలేదు. వాడికి పేరు వచ్చేయాలి. ప్రతీ మనిషికి ఒక శవం ఉంటుంది, ఆ శవానికి ఒక పేరు ఉంటుంది. ఇవి రెండూ నిజం

కాదు. నిజం కాని ఈ రెండింటిని పట్టుకొని కష్టపడి తిరుగుతున్నాడు సాధన చేస్తున్నాడు, ఫెయిల్ అవుతున్నాడు. మీరు ఇంటికి వెళ్ళి ఆలోచించుకోండి. నేను చెప్పిన మాటలు నమ్మవద్దు. మిమ్మల్ని బలవంతంగా నమ్మించవలసిన పని నాకు లేదు. మిమ్మల్ని ఏదో రమణభక్తులగానో, శివభక్తులగానో చేసే పని మాకు లేదు, మీచేత ఓట్లు వేయించుకోవాలనే బుద్ధి మాకు లేదు. అందుకే భగవాన్ చెప్పేవారు అందరూ గజ ఈతగాళ్ళే, ఎవడూ గజం కదలటం లేదు అని, ఈ రూపబుద్ధి, నామబుద్ధి తాచుపాము కంటే ప్రమాదమైనవి. తాచుపాము కరిస్తే పోనీ ఆ శరీరం పోతుంది. ఈ రూపబుద్ధి, నామబుద్ధిలోనుండి బయటకు రాకపోతే ఇవే కోటి జన్మలకు కారణం అవుతాయి. నేను ఏదో చెప్పటంకాదు, మీరు లోతుకు వెళ్ళి ఆలోచించుకోండి. మీరు సుఖంగా లేరు, శాంతిగా లేరు ఇంక ఈ పేరు, రూపం ఏమి చేసుకొంటారు. ఈ నామరూపములను ఓవర్‌కమ్ చేయాలి. ఈ రూపబుద్ధి నుండి, నామబుద్ధి నుండి బయటకు రాలేరు అనుకోండి ఇంక మీరు గానుగుఎద్దులాగ తయారవుతారు. గానుగుఎద్దు మూడు గంటలు నడుస్తుంది, నేను చాలా దూరం వెళ్ళిపోయాను అనుకొంటుంది, గంతలు విప్పేసాక గానుగ దగ్గరే ఉంటుంది. మనం కూడా అంతే. గానుగఎద్దు నడుస్తోంది, దాని తప్పు ఏమీ లేదు, కాని ఎక్కడ నడుస్తోంది గానుగ చుట్టూ నడుస్తోంది. అలాగే మనం రూపబుద్ధి, నామబుద్ధి చుట్టూ తిరుగుతున్నాము. రూపబుద్ధి, నామబుద్ధిలో నుండి జీవుడు బయటకు రాలేడు అనుకోండి వాడికి జ్ఞానంలేదు, మోక్షంలేదు, శాంతిలేదు, సుఖంలేదు. కొంతమంది పెద్ద పెద్ద చదువులు చదువుతారు, పిహెచ్‌డిలు ఉంటాయి, పెద్ద పెద్ద పదవులు చేస్తారుగాని రూపం, నామం వీటిని దాటలేరు. అందుకే ప్రహ్లాదుడు అన్నాడు చదువవలెను, చదువవలెను చావులేని చదువు చదువవలెను. రూపబుద్ధిని, నామబుద్ధిని దాటకపోతే ఎంతచదివినా అది వల్లకాటికే. చావులేని చదువు అంటే ఈ దేహం చనిపోతున్నా నేను చావు లేకుండా ఉన్నాను అన్న సంగతి నీకు తెలుస్తూ ఉంటుంది. నువ్వు రూపంగా ఉండవు, నువ్వు నామంగా ఉండవు, కాని ఉంటావు, నువ్వు ఉన్నావన్న సంగతి నీకు తెలుస్తూ ఉంటుంది, అదే అమృతానుభవం. ఇంక వాడిని జన్మలు ముట్టుకోవు. మీరు సాధన చెయ్యండికాని గురువు అనుగ్రహం లేకుండా మటుకు మనోనాశనం అవ్వదు.

భగవంతుడు మీకు ఏ అవకాశములు అయితే ఇచ్చాడో వాటిని కొంతవరకు ఈ సృష్టికి కూడా ఉపయోగించండి. దానివలన ఆధ్యాత్మికంగా అభివృద్ధి కలుగుతుంది. భగవంతుడు మీకు ఏదైనా శక్తిని ఇచ్చాడు అనుకోండి దానిని మనం ఉపయోగించుకోవాలి కాని పాడుచేయకూడదు. మీ ఇంట్లో నలుగురికి సరిపడ మజ్జిగ ఉంది అనుకోండి. మీ

ఇంట్లో ఇద్దరే ఉన్నారు అనుకోండి, మిగతా ఇద్దరికి పనికి వచ్చే మజ్జిగ పెంటమీద పోయనక్కరలేదు, ఆ మజ్జిగ ఎవరికైనా ఇవ్వండి. ఒకవేళ నీద్వారా ఏదైనా మంచి జరిగింది అనుకో అది నేను సాధించాను, ఇది నేను సాధించాను అంటే అది తప్పలలో కెల్లా పెద్ద తప్ప అంటున్నారు భగవాన్. ఎందుచేతనంటే భగవంతుడే ఆ పనిని నీ ద్వారా చేయించాడు, లేకపోతే నువ్వు ఏమి చెయ్యగలవు, నీ వల్ల ఏమీ అవ్వదు. ఒకడు ప్రధానమంత్రి అయ్యాడు అంటే వాడి తెలివితేటల వలన కాదు. భగవంతుడు వాడిని అక్కడ కూర్చోబెట్టాలి అనుకొన్నాడు అంతే. నెగ్గినవారు అందరూ తెలివైనవారు అని కాదు, ఓడిపోయిన వారు తెలివి తక్కువ వారు అని కాదు. ఒక కెరటంలో నెగ్గుతూ ఉంటారు, ఒక కెరటంలో ఓడిపోతూ ఉంటారు, వారి తెలివితేటలతో సంబంధం లేదు, మనం అందరం విధి చేతులలో బొమ్మలం. మీరు అలాగ ఉండవద్దు, ఇలాగ ఉండవద్దు. మీరు ఎలాగ ఉన్నారో అలాగ ఉండండి. మేము అలాగ ఉన్నాము, మేము ఇలాగ ఉన్నాము అంటే ఈ శవాలు మిమ్మల్ని విడిచిపెట్టవు, పునర్జన్మలు విడిచిపెట్టవు. అసలు ఉండటం అంటే ఏమిటో మీకు అర్థమవ్వాలి. అప్పడు మీరు శాంతి సముద్రంలో, ఆనంద సముద్రంలో ఊగిసలాడతారు, అప్పడు మీకు దేహంతోగాని, లోకంతోగాని, దేవుడితోగాని పనిలేదు. నదికి వరద వచ్చినప్పడు గడ్డిపరక ఎంత వేగంగా కొట్టుకొని పోతుందో శివానుగ్రహం మీకు కలిగినప్పడు మీ బుద్ధిలో ఉన్న దోషాలు అంతవేగంగా బయటకు పోతాయి, అప్పడు జ్ఞానం అనే దుప్పటితో మిమ్మల్ని కప్పతాడు. వాడే శివుడు, వాడే నారాయణుడు, వాడే ఆత్మ.

అర్జునుడు అంతటివాడిని పట్టుకొని పరమాత్మ ఏమన్నాడు నువ్వు ఊరికే బొమ్మలాగ నిలబడు, చేతులు ఆడించు, నువ్వు ఎవరినైతే చంపుదామనుకొంటున్నావో వారినందరిని నేను చంపి పోగులుపెట్టి ఉంచాను అన్నాడు. అంటే ఎవరు పని చేసారు, నారాయణుడు చేసాడు. మనం ఏమనుకొంటున్నాము అర్జునుడు యుద్ధాలు చేసాడు అనుకొంటున్నాము. చేసింది నారాయణుడే, అర్జునుడి దేహాన్ని ఉపయోగించుకొన్నాడు అంతే. అలాగే లోకంలో మీ ద్వారా ఏవైనా మంచి పనులు జరిగితే మీరు చెయ్యటంకాదు, మీ దేహాన్ని భగవంతుడు ఉపయోగించుకొన్నాడు అంతే, అది మీకు అర్థమవ్వాలి. అది మీకు అర్థమైతే మీకు ఇంక ఆడంబరం రాదు. కృష్ణుడు అర్జునుడు చాలాకాలం కలిసి తిరిగారు. భగవద్గీత చెప్పేటప్పడు కూడా విశ్వరూప దర్శనం అయ్యేవరకు కృష్ణుడి యొక్క వైభవం ఏమిటో అర్జునుడికి అర్థం కాలేదు. ఆయనకే అర్థమవ్వనప్పడు మనకు ఏమి అర్థమవుతుంది. భగవంతుడు మనకు ఎంత వరకు తెలియబడితే అంతవరకు తెలుసుకోగలము కాని లేకపోతే మనం ఆయనను తెలుసుకోలేము. ఆయన సర్వశక్తిమంతుడు. ఆయన దయలేకుండా మనలో ఉన్న అజ్ఞానం

నశించదు. మీరు పవిత్రతను పెంచుకోండి, ఏకాగ్రతను పెంచుకోండి, బుద్ధిసూక్ష్మతను పెంచుకోండి, ఓర్పుగా జీవించండి. ఈ దైవీ సంపదనంతా మనం జాగ్రత్తగా సమకూర్చుకొంటే ఆత్మజ్ఞానం పొందటానికి అర్హత కలుగుతుంది. భగవంతుడు చేసే పనిని మేము చేస్తున్నాము అంటారేమిటి. భగవంతుడే చేస్తున్నాడు అనే గుర్తింపు కూడా లేని మీకు జ్ఞానం ఎలా వస్తుంది. భగవంతుడు చేస్తున్నాడు అని తెలియకపోవటం ఒక పొరపాటు, పైగా నేను చేస్తున్నాను అనుకోవటం ఇంకో పొరపాటు. ఈశ్వర ప్రణాళిక ప్రకారం ఇదంతా జరుగుతోంది. ఈ జీవకోటిని, పంచభూతాలను నియమించేవాడు ఆయనే. ఒక పురాణంలో ఏమని ఉందంటే నీవు అరుణాచలం, అరుణాచలం అని ఆ నామాన్ని ఒక్కసారి చేస్తే మూడు వేల కోట్ల శివనామం చేసిన ఫలితం వస్తుంది అని వ్రాసారు. మనం ఎక్కడ పొరపాటు చేస్తున్నాము అంటే భగవంతుడు చేసేది మనం చేస్తున్నాము అనుకొంటున్నాము, దాని వలన అజ్ఞానం పెరుగుతోంది. అన్నం వండేటప్పుడు గరిటను ఎలా ఉపయోగించుకొంటామో అలాగ భగవంతుడు మన శరీరాలను ఉపయోగించుకొంటున్నాడు అంతే, అది మీకు అర్థమవ్వాలి.

నాకు భక్తి కావాలి, భక్తిని పెంచుకోవాలని ఉంది అని భగవాన్‌ను అడుగుతున్నారు. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే భక్తిని పెంచుకోవాలి అనే తపన నీకు ఉంటే, ఆ జిజ్ఞాస నీకు ఉంటే అదే జ్ఞానాన్ని తీసుకొని వస్తుంది. భగవదనుభవం పొందాలి అనే తలంపు నీకు వస్తూ ఉంటే, నీకు పూర్వపుణ్యం ఉంటే నీకు అటువంటి తలంపులు వస్తాయి గాని లేకపోతే రావు. నీకు ఎప్పుడైతే జిజ్ఞాస కలిగిందో ఎంతోకొంత ఆచరించాలనే బుద్ధి నీకు కలుగుతుంది, ఆచరణలో నుండి ఆత్మజ్ఞానం వస్తుంది. పూర్వజన్మలలో ఎంతోకొంత సత్కర్మ చేసి ఉంటే జిజ్ఞాస నీకు కలుగుతుంది కాని లేకపోతే రంపం పెట్టి కోసినా రాదు. ఇంతమంది భక్తులు సబ్జక్టు వింటున్నారు. మన భక్తులు ఈ సబ్జక్టు ఎందుకు వింటున్నారో నాకు తెలియటం లేదు. కొంతమంది పెళ్ళిళ్ళ విషయాలు మాట్లాడటానికి, ఏవో కుటుంబవిషయాలు మాట్లాడటానికి నా దగ్గరకు వస్తారు. తలుపులు వేసుకొని చెపుతారు, నాకు తోచిన సలహా నేను చెపుతాను. వారు తలుపులు వేసుకొని ఎందుకు చెబుతున్నారు అనే ఆలోచన కూడా వారికి ఉండదు. తలుపు సందులలో నుండి వినేవాళ్ళు ఉన్నారు. వారు ఏదో ముఖ్యమైన విషయం మాట్లాడుకొంటున్నారు, అలా తలుపు సందులలోనుండి వినకూడదు అనే చిన్న విషయం కూడా తెలియని మీకు ఆత్మజ్ఞానం ఏమిటి? మిమ్మల్ని ఏదైనా సలహా అడిగితే చెప్పవచ్చు. వారు తలుపులేసుకొని ఏదో మాట్లాడుతూ ఉంటే సందులలో నుండి మీరు వినటం ఏమిటి? అందుకే భగవాన్ చెప్పారు ఇతరుల గొడవలలో కలుగజేసుకోవద్దు. ఇతరుల గొడవలలో కలుగజేసుకొంటే నీ పతనం ప్రారంభమవుతుంది. కొంతమంది భక్తులు ఎలా

ఉన్నారు అంటే వారి కుటుంబంలో గొడవ ఎవరికీ తెలియకూడదు, మిగతా వారి కుటుంబంలో ఏదైనా జరిగితే దేశమంతా తెలిసిపోవాలి. అంటే మనం అంత బుద్ధిమంతులం. ఇదే విషయం ఏసుక్రీస్తు చెప్పాడు. ఎదుటివాడి కంటిలో ఉన్న నలుసు నీకు కనపిస్తోంది కాని నీ కంటిలో ఉన్న దూలం నీకు కనబడటం లేదు. ఇప్పుడు మనం కలకత్తా వెళ్ళాలి అనుకొన్నాము అనుకోండి. కలకత్తా వెళ్ళే రైలు ఎక్కి కూర్చొంటే కొద్ది ఆలస్యం అయినా మొత్తంమీద కలకత్తాలో పడేస్తుంది. అసలు నీకు జిజ్ఞాస ఉంటే, భగవదనుభవం పొందాలి అనే తపన నిజమైతే అదే నిన్ను గమ్యానికి చేరుస్తుంది. భగవదనుభవం పొందటానికి నీకు ఏ మనస్సు అయితే అడ్డు వస్తోందో అది నీకు ఉన్న జిజ్ఞాసలో కరిగిపోతుంది. మనం వెలిగించిన వెంటనే హారతి కర్పూరం ఎలా హరించుకొనిపోతుందో అలాగ జిజ్ఞాసలో, జ్ఞానాగ్నిలో నీ మనస్సు కరిగిపోతుంది. నీ మనస్సు ఎప్పుడైతే కాలిపోయిందో అందులో ఉన్న బలహీనతలు, నీ పునర్జన్మ హేతువులు అన్నీ కూడ కాలి బూడిద అయిపోతాయి. నీ మనస్సు శేషం లేకుండా ఎప్పుడైతే కరిగిపోయిందో అప్పుడు నీలో ఉన్న ఆత్మ నీకు తెలియబడుతుంది. నీవు ఆత్మగా ఎప్పుడైతే మిగిలిపోయావో, నిలిచిపోయావో అప్పుడు ఇంక నీవు జీవుడవు కాదు, నీవు శివుడివే అంటే శివస్వరూపాన్ని పొందుతావు.

ఈ మీటింగు అయిపోయాక ఎవరి ఇంటికి వారు వెళ్ళిపోయినట్లుగా ఈ శరీరాలు చనిపోయాక ఎవరి మార్గంలో వారు వెళ్ళిపోతారు. ఒక్కమాట మీరు బాగా గుర్తుపెట్టుకోండి. మేము కష్టాలు అనుభవిస్తున్నాము, మాకు నష్టం వచ్చింది, ఇలా ఎన్ని జన్మలు ఎత్తాము, ఎన్ని శవాలను మోసాము అని ఏదో ఒకటి అనుకొంటూ ఉంటాము కదా. మీ మనస్సు ఎప్పుడైతే వేరుతో సహా నశించిందో అప్పుడు, మీరు ఇప్పటివరకు అనుకొన్నవి అన్నీ అబద్ధాలు అన్న సంగతి మీకు స్ఫురిస్తుంది. అదే జ్ఞానం. అప్పుడు ఇంక పుణ్యపాపాలతో, లాభనష్టాలతో, జన్మలతో మీకు సంబంధం లేదు. మనం పీల్చుకొనే గాలి ఎంత స్వచ్ఛంగా ఉండాలి అని అనుకొంటామో మనం తినే ఆహారం ఎంత శుభ్రంగా ఉండాలి అని అనుకొంటామో అలాగే మనం చేసే స్నేహాలు కూడా అంత స్వచ్ఛంగా ఉండాలి అని కోరుకోవాలి. అప్పుడు మనకు చైతన్యస్థాయి పెరుగుతుంది. కాని స్నేహాల విషయం దగ్గరకు వచ్చేటప్పటికి మంచిస్నేహాలు చేయాలనే బుద్ధి మనకు రావటం లేదు. చదివే గ్రంథాలు, చేసే స్నేహాలు, పెరిగే వాతావరణం ఇదంతా ప్యూర్‌గా ఉంటే మనస్సుకు చాపల్యం ఆగిపోతుంది, హృదయంలో శాంతి కలుగుతుంది. మీకు ఏవైనా చెడుతలంపులు వస్తూ ఉంటే మొగ్గలోనే తుంచేయండి, చెట్టు అవ్వనివ్వవద్దు. చెట్లు అయితే మరల కొట్టటం చాలా కష్టం అవుతుంది, రంపాలు కావాలి. మొగ్గలో అయితే చేతితో తుంచేయవచ్చు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 13-03-07 | శుక్ర | ఆనంద ఎస్టేట్, జువ్వలపాలెం రోడ్డు, భీమవరం |
| 18-04-07 | బుధ | చిలుకూరు |
| 20-04-07 | శుక్ర | ఆత్రేయపురం, తూ॥గో॥ జిల్లా |
| 25-04-07 | మంగళ | జిన్నూరు, శ్రీ రమణ క్షేత్రం |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

# నిజమైన ఆనందం

నది ఒక ఒడ్డు నుండి రెండవ ఒడ్డుకు చేరవేయుటకు పడవ ఎట్లు ముఖ్యమైన సాధనమో, జీవత్వమునుండి స్వరూపానందములోకి ప్రవేశించుటకు ఈ మానవజన్మ అంతే ముఖ్య సాధనము. నిజమైన ఆనందము భౌతిక విషయములలోను, వస్తువులలోనూ, ప్రపంచంలోనూ లేదు. అది స్వరూపంగానే వుంది. ఆనందము మనకన్న భిన్నమైన వస్తువు కాదు కాబట్టి ఆనందము కొరకై మనము చేసే ప్రయత్నము ద్వారా లభించదు. ఆనందం స్వరూపంగా వ్యక్తం కాకపోవుటకు కారణం దేహాత్మ బుద్ధియే! దప్పికతో ఉన్నప్పుడు శుభ్రమైన నీరు త్రాగుటమాని నీటిని గురించి ధ్యానించినట్లు ఉన్నాయి మన సాధనలు. నీరు త్రాగనంతవరకు దప్పిక తీరనే తీరదు. మన నిజ తత్త్వాన్ని మరచిపోవడం వల్ల అనగా దేహాత్మబుద్ధి వలన రాగద్వేషాలు, అసూయ, కోపము, మృత్యు భయము మున్నగు వికారాలకు లోనవుచున్నాము. నిజమైన ఆనందము దేహేంద్రియ మనోబుద్ధులకు అతీతము, శాశ్వతము, ఆదిమధ్యాంతరహితము. అట్టి నిజమైన ఆనందాన్ని స్వరూపంగా అనుభవించాలంటే దేహాత్మ బుద్ధి నశించి తీరవలసిందే! దేహాత్మబుద్ధి నశించాలంటే మనలోని దుర్గుణాలను దూరం చేసుకొంటూ నిష్కామకర్మ, సజ్జన సాంగత్యముల ద్వారా మనస్సును పవిత్రం చేసుకోవాలి. దీనిలో అత్యంత కీలకమైనది గుర్వనుగ్రహము.

**చావలి సూర్యనారాయణమూర్తి**

టీచర్, అమలాపురం

# సత్యానుభూతికి విచారణే మాస్టర్ 'కీ'

అంతులేని సుఖశాంతులు ఉన్న మన హృదయమనే పెట్టి తెరవాలంటే విచారణామార్గమే పెద్ద తాళం. అన్ని ఆధ్యాత్మిక మార్గాలు కన్న ఇది సూటి అయినది. దీనికి చాప, బల్ల అక్కరలేదు. సునిశితమైన, నిర్మల, కుశాగ్ర బుద్ధి సరిపోతుంది. మనలను ఎవరైనా "మీరు ఎవరు?" అంటే కులం పేరు, నివాసం వంటి అప్రధానమైనవి చెబుతాము. మూలమైన ఆత్మ స్ఫురణ మనకు రావటం లేదు. ఇదే పెద్ద మాయ. ఆత్మానుభవానికి ప్రధాన అవరోధం మనస్సే. అది ఎక్కడ పుడుతుందో వెదికి దాని విజృంభణను ఆపుచెయ్యటమే విచారణ. మదపుటేనుగు వంటి మనస్సును అదుపుకు, నేను ఎవండును? అనే ప్రశ్న అంకుంశం లాంటిది. అది బుద్ధిని సాక్షీభూతంగా ఉంచటానికి సహకరిస్తుంది. మన ముఖం అద్దంలో చూసుకొంటే మసి ఉంటే తొలగించుకోవచ్చును. మన మనో వికారాలను తెలుసుకొనే అద్దం ఒకటి ఉంది. విచారణ అనే అద్దం. అందులో మన ఆలోచనలు, ఉద్రేకాలు, బెంగలు, భయాలు, బాధలను చూచుకోవచ్చును. అవి స్ఫురించినప్పుడు ఇవి ఎవరికి అని ప్రశ్నిస్తే వాటిని శిలువవేసినట్లే. కారణం మనస్సు మనం కాము. మనం ఇతరులతో మాట్లాడేటప్పుడు సహజంగా మాట్లాడుతున్నామా? ప్రయోజనం ఉండి మాట్లాడుతున్నామా? ప్రయోజనం లేకపోతే మొరటుగా, తృణీకారంగా మాట్లాడుతున్నామా? అని గ్రహించాలి. మరి ఒకరితో భయం వల్ల మర్యాదగా వారు వచ్చినప్పుడు లేచి నిలబడి మాట్లాడుతున్నాము. అదే నౌకరు వస్తే పట్టించుకోము. ఆ అద్దంలో నన్ను నేను ఇలా గమనించుకొంటే ఇతరులకు ఎంత కృత్రిమమైన గౌరవం ఇస్తున్నాము అని తెలిసిపోతుంది. మనం అహంకారంతో మాట్లాడకూడదు. ఎవరైనా అలా మాట్లాడితే అందులో కలిసిపోకుండా దాని పోకడలను గమనించాలి. శ్రీ నాన్నగారు "అబ్జర్వేషన్ వల్ల కూడా నాలజ్జి వస్తుంది. సుప్రీమ్ స్టేజ్ (ఆత్మనుంచి) జారిపోతే మనస్సు అనే అడవిలో పడిపోతాము" అన్నారు. వస్తు రహితంగా, విజయ రహితంగా కేవలం చైతన్యం ఉంది. నేను వింటున్నాను, చూస్తున్నాను, ఆలోచిస్తున్నాను అనేవి మనో బుద్ధులతో తాదాత్మ్యం వల్లనే అని గ్రహించాలి. విషయాలు గుర్తించినప్పుడు వాటికంటే నేను వేరని తెలుసుకోవాలి. అవి చైతన్యం సమక్షంలో తెలియబడుతున్నాయని గ్రహించాలి. నేను కర్తను అనే విషసర్పం కాటుతో అశాంతితో ఉన్నాము. వాటికి విరుగుడు నేను సాక్షిని అనే అమృతాన్ని తాగి సుఖంగా ఉండాలి. ఈ విచారణ వల్ల ఊరుతూ ఉండే మనస్సు ఊరక ఉంటుంది. అప్పుడు గురువు ఆత్మ పెట్టి "కీ" మనకు ఇస్తారు. ఆ అనంద సంపదకు వారసులౌతాము.

- **సాగిరాజు రామకృష్ణంరాజు**, అర్థవరం